بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపుటి 1

సంచిక 20

వార్షిక చందా 300/-రూ॥

# వార పత్రిక బదర్ ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadrqadian.in

15 షవ్వాల్ 1437 హి.ఖ, 21 వఫా 1395, హి.శ, 21 జులై 2016

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మొమినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

మేము ఆరంభము నుండి చివరి వరకు పవిత్ర ఖుర్‌ఆన్‌ను క్షుణ్ణంగా పరిశీలించినాము. మరియు చాలా శ్రద్దతో చదివినాము, పదే పదే అన్వేషించినాము, దాని అర్ధాలను అతి సూక్ష్మంగా పరిశీలించినాము, పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఎన్ని లక్షణాలు, సుగుణాలు గలవో ఆ సుగుణాలకు, లక్షణాలకు మూలాధారం అల్లాహ్ అనే పదమే నని చివరికి మాకు తెలిసినది.

**ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

"చివరికి మేము అబ్దుల్ హకీం ఖాన్‌ను మార్గ భ్రష్టున్ని చేసిన అంశం, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించ వలసిన అవసరం లేదనే ఆలోచనలు అతనికి కలుగుటకు గల కారణంను కూడ బహిర్గతము చేసెదము, అదేమిటనగా కేవలం తన అవివేకం, అవగాహన లోపం, మూర్ఖత్వం వలన పవిత్ర ఖుర్‌ఆన్‌లో గల ఈ సూక్తిని తప్పుగా అర్ధం చేసుకోవడము.

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَادُوْا وَالنَّصٰرٰى وَالصّٰبِـِٕيْنَ مَنْ اٰمَنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَعَمِلَ صَالِحًا فَلَهُمْ اَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ ۚ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ

అనగా: ఇస్లాంను స్వీకరించిన వారు, మరియు యూదులు, క్రైస్తవులు, నక్షత్రాలను ఆరాధించు వారు, వీరిలో ఎవరైనను అల్లాహ్ తాలాను, ప్రళయ కాలంను విశ్వసించి, సత్కార్యములు చేసినచో అల్లాహ్ తాలా వారిని వృధా చేయడు. ఇట్టి వారి ప్రతిఫలం వారి పోషకుని వద్ద గలదు. వారికి ఎలాంటి భయము, భీతి ఉండదు. ☆

ఈ సూక్తిని తన అవగాహన లోపం వలన సరిగా అర్ధం చేసుకోలేక పోవడం వలనే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుకున్నను ఏమియు కాదనే ఆలోచన అతనికి తట్టినది. చాలా విచారకరమైన విషయం ఏమిటంటే, వీరు తమ మోహస్థితికి బానిసలై, పవిత్ర ఖుర్‌ఆన్ యొక్క అద్భుతాలను, నిదర్శనాలను వ్యతిరేకిస్తున్నారు. అంతేగాకా ఇస్లాంను వీడుటకు ఇలా అనుమానితమైన విషయాలను అసరాగా చేసుకొంటున్నారు. ఈ సూక్తి ద్వారా వారు ఎలాంటి లాభమును పొందలేరనే విషయంను వారు గుర్తుంచుకోవలెను. ఎందుకనగా అల్లాహ్ తాలాను విశ్వసించడం, ప్రళయ కాలంను విశ్వసించడం అనే విషయాలలోనే పవిత్ర ఖుర్‌ఆన్‌ను, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించవలెనన్న వాస్తవము దాగి యున్నది. అలా ఎందుకు భావించుకోవలెననగా అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ అనే నామమును ఈ విధముగా విశదీకరించెను. అల్లాహ్ అనగా సకల లోకాల సంరక్షకుడు, అపార దయామయుడు, పరమ కారుణ్యమూర్తి, అతడే భూమ్యాకాశములను కేవలం ఆరు రోజులలో పుట్టించెను, మరల ఆధమును పుట్టించెను, అవతార పురుషుల పరంపరను కొనసాగించెను. దైవ గ్రంధములను అవతరింపజేసెను, చివరికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రవక్తలందరికి నాయకుడిగా, ఉత్తమ అవతార పురుషునిగా ప్రపంచమునకు పంపెను. పవిత్ర ఖుర్‌ఆన్ ప్రకారంగా ప్రళయ కాలం అనగా మృతులను సజీవులుగా చేయును. వారిలో ఒక వర్గమును స్వర్గమునకు, మరో వర్గమును నరకంనకు పంపును. స్వర్గం అనగా శారీరక, ఆధ్యాత్మిక అనుగ్రహముల ప్రాంతము, నరకం అనగా శారీరక, ఆధ్యాత్మిక శిక్షల నిలయం. మరల ఈ దైవ గ్రంధమును విశ్వసించు వారే పరలోకమును విశ్వసించెదరని అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో తెలిపెను,

కావున ఎప్పుడైతే అల్లాహ్ తాలా అల్లాహ్, పరలోక అర్ధంలను స్వయంగా ఇస్లాంనకు అనుగుణంగా విశదీకరించినప్పుడు, ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించెదరో, పరలోకమును విశ్వసించదరో అట్టి వారికి కూడ పవిత్ర ఖుర్‌ఆన్‌ను, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించుట కూడ తప్పని సరియే అగును. వీటి అర్ధాలను మార్చే శక్తి మరెవరికి ఉండదు. అంతేగాకుండా పవిత్ర ఖుర్‌ఆన్ విశదీకరంచిన అర్ధంనకు భిన్నమైన భావం వచ్చు అర్ధములను కనుగొను హక్కు మనకు ఏ మాత్రం లేదు. మేము ఆరంభము నుండి చివరి వరకు పవిత్ర ఖుర్‌ఆన్‌ను క్షుణ్ణంగా పరిశీలించితిమి. చాలా శ్రద్దతో చదివినాము, పదే పదే అన్వేషించినాము, దాని అర్ధాలను అతి సూక్ష్మంగా పరిశీలించినాము, చివరికి మాకు తెలిసినది ఏమనగా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఎన్ని లక్షణాలు, సుగుణాలు గలవో ఆ సుగుణాలకు, లక్షణాలకు మూలాధారం అల్లాహ్ అనే పదమే నని తెలిసినది. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ ఈ విధముగా అనేకములు గలవు. అనేక సూక్తులలో అల్లాహ్ అనగా పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవతరించిన వాడు, ముహమ్మద్ ప్రవక్తను పంపిన వాడు అని పేర్కొనడం జరిగినది. అందుకే తెలుపునది ఏమనగా పవిత్ర ఖుర్‌ఆన్ భావం ప్రకారం హజ్రత్ ముహమ్మద్ ప్రవక్తను పంపినవాడే అల్లాహ్ అని పేర్కొన్నప్పుడు ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించెదరో వారి విశ్వాసం అతడు పంపిన ముహమ్మద్ ప్రవక్తను తప్పకుండా విశ్వసించినప్పుడే పటిష్టమగునని నిర్ధాణమైనది. అల్లాహ్ తాలా ఈ సూక్తిలో "ఎవరైతే రహ్మాన్ విశ్వసించెదరో, ఎవరైతే రహీంను విశ్వసించెదరో, ఎవరైతే రహీంను విశ్వసించెదరో అని పేర్కొనకుండా ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించెదరో అని పేర్కొనడం జరిగినది, అందుకే అల్లాహ్ అనగా పరిపూర్ణ గుణములన్నింటిని తనలో ఏకం చేసుకున్నవాడు అని అర్ధం. అందులో గల అత్యంత ఉన్నతమైన అతని ఒక లక్షణం పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవతరింప జేసినవాడు. ఇలాంటి పరిస్థితులలో ఎవరైతే హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను, పవిత్ర ఖుర్‌ఆన్ విశ్వసించెదరో వారినే అల్లాహ్‌ను విశ్వసించిన వారిగా గుర్తించెదము. ఒకవేళ ఎవరైన ఇన్నల్లజీన ఆమను యొక్క అర్ధం ఏమిటని ప్రశ్నించినచో వారు తెలుసుకోవలసినది ఏమనగా ఎవరైతే కేవలం అల్లాహ్ తాలాను విశ్వసించెదరో వారి విశ్వాసం అల్లాహ్ తాలా యొక్క ప్రవక్తలను విశ్వసించనంత వరకు లేదా వారి విశ్వాసంను పటిష్టం చేసుకోనంత వరకు నమ్మకమైనది కాదని వారు తెలుసుకోవలెను. అంతేగాకా పవిత్ర ఖుర్‌ఆన్ లో భిన్నమైన బోధనలు లేవని కూడ వారు తెలుసుకోవలెను. కావున కేవలం దైవ ఏకత్వంనే విశ్వసించడంతో సరిపోదని, అతని ప్రవక్తలను కూడ విశ్వసించవలెనని అల్లాహ్ తాలా పదే పదే అనేక సూక్తులలో తెలియజేసి నప్పుడు, అతని ప్రవక్తలను విశ్వసించకుండా అందుకు భిన్నమైన ఒకే ఒక సూక్తిని అది కూడ సరిగా అర్ధ చేసుకోకుండా కేవలం దైవ ఏకత్వంను విశ్వసించినచో విముక్తి లభించునని చూపడం ఎలా భావ్యమగును. అది కూడ పవిత్ర ఖుర్‌ఆన్ మరియు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించకుండా. అపై ఆ సూక్తిలో దైవారాధనను గూర్చి ఏమియు లేదని వాధించడం. ఒకవేళ దైవారాధనయే లక్ష్యమైనచో ఎవరైతే దైవారాధనను విశ్వసించెదరో అని పేర్కొనాలి కాని ఎవరైతే అల్లాహ్‌ను విశ్వసించెదరో అని మాత్రమే ఉన్నదని వాధించడం ఎంత వరకు సమంజస మగును. అందుకే ముందుగా ఆమన బిల్లాహి అనే పదానికి సరైన అర్ధంను మనము పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఏవిధముగా ఉపయోగించబడినదో క్షుణ్ణంగా పరిశీలించినచో తెలుస్తుంది. మనలో నిజాయితి ఎలా ఉండవలెననగా ఎప్పుడైతే పవిత్ర ఖుర్‌ఆన్ అల్లాహ్ అర్ధం పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవతరించిన వాడు, ముహమ్మద్ ప్రవక్తను పంపినవాడని తెల్పినప్పుడు ఆ అర్ధంను మనము స్వీకరించవలెను. అంతేగాని మన సొంత నిర్ణయాలతో అర్ధాలను తీసుకోన కూడదు.

☆ దైవ ఏకత్వము సరిపోవునని ఈ సూక్తితో తెలిసినచో వివరించిన సూక్తితో పశ్చత్తాపము పడకుండానే అన్యారాధన వంటి పాపములన్ని క్షమించుబడునని తెలియును. قُلْ يٰعِبَادِيَ الَّذِيْنَ اَسْرَفُوْا عَلٰٓى اَنْفُسِهِمْ لَا تَقْنَطُوْا مِنْ رَّحْمَةِ اللّٰهِ ۭ اِنَّ اللّٰهَ يَغْفِرُ الذُّنُوْبَ جَمِيْعًا ఆ సూక్తి ఇదియే. వాస్తవానికి ఇది సరికాదు.

(హకీఖతుల్ వహీ, రూహానీ ఖజాయిన్ సంపుటి 22, పుట 144-147)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం :-

**ఆ॥ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవతరణ ఉద్దేశము**

======== ========

అల్లాహ్ తాలా అతని దూతలు దైవ ప్రవక్తను దీవిస్తున్నారు. (కావున) ఓ విశ్వాసులారా! మీరు కూడ అతను శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలి అని (దైవాన్ని) ప్రార్థించండి. (అల్ అహ్జాబ్: 57)

అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లైత అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వఅలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్.

అల్లాహ్ తాలా మార్గదర్శనమే లేకపోతే ఈ ప్రపంచములో మానవ జీవనము సన్మార్గములో సవ్యంగా సాగడం సాధ్యపడేది కాదు. మానవునికి సన్మార్గం చూపడం కోసం అల్లాహ్ తాలా తన గ్రంథమును అవతరింప జేసినప్పటికి ఆ గ్రంథములోని ఆదేశాలను నిర్దేశాలను విపులీకరించి వాటికనుగుణంగా తమ వ్యక్తిగత జీవితమును గడిపి, దైవానుగ్రహముతో తాము స్థాపించినటువంటి సమాజాన్ని సవ్యంగా నడిపించడం కోసం, ప్రవక్తలను, సందేశహరులను, మహాపురుషులను, యుగ పురుషులను అవతరింప జేయడం జరిగినది.

దైవాదేశములను క్రియారూపకంలో ఆచరించి చూపే శక్తి సామర్థ్యములు ఈ సృష్టిలో కేవలం మానవునికి మాత్రమే ఉన్నాయి. అందుచేతనే అల్లాహ్ తాలా మానవ అవసరాలకు వారి స్వభావం, ప్రవృత్తి ఉద్రేకాలు, ఉద్వేగాలు, మొ॥లగు అంశాలకు అనుకూల గుణములున్న మానవునినే ఆది నుండి ప్రవక్తగా నియమించి వారిని ఆదర్శ ప్రియులుగా, ఆచరణయోగ్యులుగా పేర్కొనడం జరుగుచున్నది.

మానవ చరిత్ర ఎంత పురాతనమైనదో ప్రవక్తల ఉనికి కూడ అంతే ప్రాచీనమైనది. మానవుడు ఈ భూమండలంపై కాళు మోపినప్పటి నుండి ప్రవక్తల పరంపర కొనసాగుతూనే వున్నది. ప్రతి జాతి, ప్రతి కులం, ప్రతి దేశంలో ప్రవక్తలు అవతరించి వారి వారి భాషలలో వారి వారి జాతులకు, వారి వారి కులములకు దైవవాణి ఆధారముగా సంబోధించడం జరిగినది. అందులకు ఉదాహరణగా హజ్రత్ ఆదం అలైహిస్సలాం మొదలు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వలసల్లం వరకు కొనసాగిన పరంపరయే నిదర్శనం.

ఇందుమూలముగనే సృష్టికి తల మానికమైన మానవ జాతి నుండి ప్రవక్తల పరంపరను కొనసాగించిన విషయమును అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా వివరించడం జరిగినది.

అల్లాహ్ తాలా యావత్ ప్రపంచము నుండి హజ్రత్ ఆదంను, నూహ్‌ను, ఇబ్రాహీమ్ కుటుంబమును, ఇమ్రాన్ కుటుంబమును (దైవ దౌత్యం కోసం) ప్రత్యేకముగా ఎన్నుకున్నాడు, వారిలో కొందరు కొందరి సంతానం. దేవుడు సమస్తం వినేవాడు, సర్వం ఎరిగినవాడు. (ఆలె ఇమ్రాన్ : 33,34)

అట్టి వారిలో సర్వోన్నత, ప్రవక్తల నాయకులు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు ప్రపంచ మానవులంత నాగరికత రీత్యా ఒకే సమాజముగా రూపొందుతున్న తరుణంలో అవతరించి ప్రపంచ నలుమూలలకు ఏకేశ్వరుని ఆరాధనతో పాటు ఇస్లాం యొక్క ఉత్తమమైన ఉన్నతమైన విద్యను వారి పరిశుద్ధమైన శక్తి సామర్థ్యములతో అతి తక్కువ కాలంలో వ్యాపింపజేసిన మహొన్నతుడు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతముల్ అన్బియా పదవిని మరియు బాధ్యతలను గూర్చి అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా సూచించడం జరిగినది.

విశ్వాసులలోనే ఒకరికి సమున్నతస్థాయిని కల్పించి ప్రవక్తగా పంపి, అతనిచే సూక్తులను వారి కొరకు చదివించి, వారిని పవిత్రీకరించి వారికి పవిత్ర గ్రంథమును బోధించి, వారికి జ్ఞానమును అందించి అల్లాహ్ గొప్ప ఉపకారమునే చేసెను. ఇంతకు పూర్వము వారందరు నిశ్చయముగా దిక్కుతోచని స్థితిలో నుండిరి. (ఆలె ఇమ్రాన్:165)

అల్లాహ్ తాలా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అవతరణను గూర్చిన ముఖ్యోద్దేశాలను ఖుర్ఆన్ మజీద్‌లో జుమా అధ్యాయముతో పాటు అనేక చోట్ల కూడ పేర్కొనడం జరిగినది. ఈ విధముగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిత చరిత్రను క్షుణ్ణముగా పరిశీలించినట్లయితే వారు కేవలం మనకు దైవవాణిని అందజేసే సందేశహరునిగానే కాక, దాని వ్యాఖ్యానకర్తగా, గురువుగా, బోధకుడిగా మరియు దైవాదేశములను ఆదేశించే అధికారిగా దైవ శాసనములకు అనుగుణముగా తీర్పు చెప్పే న్యాయాధిపతిగా, మానవ జీవితంలో మానసిక ఆధ్యాత్మిక పరంగా మంచి శిక్షణను ఇచ్చే పవిత్ర శిక్షకుడిగా దర్శనమిస్తూ వారి జీవితమునే మనకు "ఆదర్శప్రాయముగా" అందజేయడం జరిగినది.

ఈ విషయమును గూర్చి అల్లాహ్ తాలా ఖుర్ఆన్ మజీద్‌లో ఈ విధముగా పేర్కొనడం జరిగినది.

అల్లాహ్‌తో, పరలోక దినముతో కలియు నమ్మకమున్న వారి కొరకు, అల్లాహ్ తఆలాను చాలా స్తుతించు వారి కొరకు, అల్లాహ్ తఆలా ప్రవక్త వద్ద ఒక ఉత్తమ నిదర్శనము గలదు. (వారు దానిని అనుసరించవలెను) (అల్ అహ్జాబ్ : 22)

అల్లాహ్ తాలా తమ దైవదౌత్యం కొరకే ప్రవక్తలను సృజనాత్మకముగా తయారు చేయడం జరుగుతుంది. కావున వారికి అత్యంత పరిశుద్ధమైన స్వభావమును అనుగ్రహించడం జరుగుతుంది. వారు సాధారణ మానవుని వలె కన్పించినప్పటికి వారు పరిణతి చెందిన మహొన్నతులు, సత్యాసత్యములో విచక్షణ చేయగల ప్రకృతి సిద్ధమైన లక్షణంతో పాటు శారీరకముగా, మానసికముగా, ఆధ్యాత్మికముగా పరిపూర్ణులు, అందువలనే అల్లాహ్ తాలా వారి ఈ ప్రవృత్తిని వృద్ధి పరుస్తు జ్ఞాన, మార్గదర్శన, నిర్ణయ మొ॥ శక్తులను స్పష్టం చేసే కాంతిని విశేష గుణముగా ప్రసాధించడం జరుగుతుంది.

అందులకే వారు ఈ కాంతి ద్వారా యదార్థాన్ని వీక్షించి నిజాన్ని గ్రహించి, జీవనపు అవకతవకల గజిబిజిలో మానవులకు సన్మార్గం చూపుతు దైవదౌత్య కార్యభారాన్ని సవ్యంగా నిర్వహించగలుగుతు దైవ గ్రంథ ఉద్దేశాన్ని ప్రజలకు సక్రమముగా తెలియజేస్తూ దైవానుసారం జనుల స్వరూప స్వభావాల్ని చక్కదిద్దుతూ సత్యసమాజాన్ని నెలకొల్పుతు ఎన్నో మహత్తర కార్యాలను చేసి చూపుతారు.

ఈ భూమండలం పైన కొనసాగిన ప్రవక్తల పరంపరలో ఇప్పటి వరకు అత్యంత కాంతిని దైవం నుండి పొందిన ప్రవక్త కేవలం మహనీయుడైన ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు మాత్రమే. అందు చేతనే అల్లాహ్ తాలా ఖుర్ఆన్ మజీద్‌లో వీరిని గూర్చి "నూరున్ అలా నూర్" అనే బిరుదుతో స్మరించడం జరిగినది. అంతేకాకుండా ఈ కాంతితో అసంఖ్యాక కాంతిలీనే దివిటలను కూడ తయారు చేసే శక్తి సామర్థ్యములు మన ప్రవక్త గారికి ఉన్న విషయం. అందులకే వారి సమాజం నుండి ఎవరైన కూడ వారిని సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరించినట్లయితే అందుకు ప్రతిఫలముగా ఆ దివ్యమైన కాంతి నుండి కొంత మేరకు ప్రసాదముగా లభించును కూడ. ఇట్టి ఘనత నేటి వరకు కేవలం ఇస్లాంను స్థాపించిన మహాఘనుడు హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికే దక్కడం విశేషం.

ఇందుమూలముగా అల్లాహ్ తాలా దివ్యఖుర్ఆన్ గ్రంథములో ఈ విషయమును గూర్చి ఈ విధముగా తెలియజేసెను.

అల్లాహ్‌కు, అతని ప్రవక్తకు ఎవరు విధేయులో వారు అల్లాహ్ అనుగ్రహమును పొందిన వారిలో ఒకరగుదురు. అట్టి అనుగ్రహమును పొందినవారు ప్రవక్తలు, సత్యమూర్తులు, ఆత్మార్పణము చేసికొన్నవారు, ధర్మమూర్తులు. వీరే పరమ స్నేహితులు. ఇది అల్లాహ్ అనుగ్రహము. అల్లాహ్ సర్వజ్ఞుడు. (అన్నిసా : 70,71)

ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞలను పాటించుచు ఇస్లాం శాంతి సందేశాన్ని ప్రపంచ నలు మూలలకు అందించే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఆమీన్. ✿✿✿

# జుమా ప్రసంగము

ఉపవాసము నిష్టాపరతను నేర్చుకొనుటకు కారణమైనట్లే, దైవ సామీప్యము పొందుటకు కూడ కారణమగును". కావున రమజాన్ మాసమును నిష్టాపరతను నేర్చుకొనుటకు, ధర్మబద్ధమైన జీవితము గడుపుటకు, దైవ సామీప్యము పొందుటకు ఒక సాధనముగా చేయనిదే రమజాన్ మాసము కేవలము దుఆల ఆమోదమునకు కారణము కాజాలదు. ఈ స్థితి ఏర్పడినప్పుడు అల్లాహ్ తఆలాతో ఏర్పడిన సంబంధము రమజాన్ వరకు మాత్రమే పరిమితము గాకుండ శాశ్వత మార్పు గల ప్రభావములు వ్యక్తము చేయును.

"దు:ఆల నిబంధన ఏమిటనగా, అల్లాహ్ తాలా దు:ఆలను స్వీకరించుటలో మన ఊహలకు, కోరికలకు అనుగుణమై యుండదు. పిల్లలు తమ తల్లులకు ఎంతో ప్రాణప్రదమై యుందురు. తల్లులు కూడ తమ పిల్లలకు ఎలాంటి కష్టాలు రాకూడదని కోరుకుంటారు. కాని బాలుడు అవివేకంతో మొండివెఖరిని ప్రదర్శిస్తు, ఏడుస్తు పదునైన కత్తిని లేదా మండుచున్న నిప్పు రవ్వను పదే పదే కోరుకున్నచో, తన బిడ్డపై స్వచ్ఛమైన ప్రేమాభిమానంలు, హృదయంలో మమకారం ఉన్నా కూడ ఆ తల్లి తన బాలుడు మండుచున్న నిప్పు రవ్వను తీసుకొని తన చేతిని కాల్చుకొనుటకు లేదా పదునైన కత్తిని తీసుకొని తన చేతిని కోసుకొనుటకు ఏ విధముగానైన ఇష్టపడునా? ఏ మాత్రం ఇష్టపడదు. ఈ మమకారంతోనే మనము దు:ఆల ఆమోదమును అర్థం చేసుకోవచ్చును".

అల్లాహ్ తఆలా కృపానుసారము రమజాన్‌లో అధికులకు మస్జిద్ వైపు శ్రద్ధ యున్నది, సామూహిక నమాజ్ చదివే వైపు కూడ శ్రద్ధ గలదు. దీనికి తోడు నవాఫిల్ సలుపే వైపు కూడ శ్రద్ధ యుండవలెను. ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిచ్చు, దైవ సామీప్యము పొందుటకు గల దుఆలను ప్రాధాన్యతతో చేయవలెను. మొదటి దుఆలు అవే. ఇతర దుఆలు ప్రాపంచికమైనవి, వాటిని తరువాత చేయవలెను. అప్పుడు మన ప్రాపంచిక అవసరాల దుఆలను అల్లాహ్ తఆలా స్వయముగా పూర్తి చేయును.

గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటనగా ఇచట ప్రపంచము గూర్చి కాకుండ ధర్మమును గూర్చియే అధికంగా దు:ఆ నేర్పించడమైనది. అందువలనే మనము తన ధర్మమును రక్షించుకొనుటకు అధికంగా దుఆ చేయవలెను. మానవుడు ఇలా దు:ఆ చేసినచో అల్లాహ్ తఆలా సామీప్య ద్వారములు వాటంతట అవే తెరుచుకొనును. చేసిన దు:ఆలన్నియు ఆమోదం పొందును.

మనము దుఆ వాస్తవమును అర్థము చేసుకొనువారమగుగాక! అల్లాహ్ తఆలాపై గట్టి నమ్మకము గల వారిలో ఈ రమజాన్ మనలను చేర్చుగాక! అనంతరం శాశ్వతముగా దీనిపై నిలుచుదుము గాక! అనగా వారు అతని ఆదేశములను విని, ఆచరింతురు. తమ ప్రతి మాటపై అల్లాహ్ తఆలా ప్రీతికి ప్రాధాన్యతనిత్తురు. మన కర్మలు పూర్తిగా అల్లాహ్ తఆలా ఇష్టము ప్రకారముండుగాక! మన విశ్వాసములో గతము కంటే మించి దృఢత్వము ఏర్పడుగాక! మనలో అల్లాహ్ తఆలా నిజమైన ప్రేమ ఏర్పడుగాక! అల్లాహ్ తఆలా మమ్ములను ఇహ, పరలోక ఆపదల నుండి కూడ రక్షించుగాక! (ఆమీన్)

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్**
**క్రీ.శ. 17 జూన్ 2016 ( 17 ఎహ్సాన్ 1395 హి.షు) తేదీన మస్జిద్ ఫజల్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِينَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّينِ ۔

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ۔

صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ۔

(అల్‌బఖరహ్ : 184) అనగా నన్ను గూర్చి నా దాసులు నిన్ను ప్రశ్నించినప్పుడు నిశ్చయముగా నేను సమీపముననే యుందును. నన్ను పిలుచుచు ప్రార్థించువాని ప్రార్థనకు నేను సమాధానమిత్తును. కనుక వారు సన్మార్గమునవలంభించుటకు సావధానులై నా ఆదేశమును వినవలయును. నా యందు విశ్వాసముంచవలయును.

ఉపవాసముయుండుట, దాని నియమ నిబంధనలు, దాని గురించి గల ఆదేశముల మధ్య ఈ సూక్తిని పెట్టి రమజాన్ – దుఆల ఆమోదము వైపు మనకు ప్రత్యేక శ్రద్ధ కలిగించబడినది. ఈ సంబంధము గురించి హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు తఆలా అన్హు ఇట్లనిరి. "ఉపవాసము నిష్టాపరతను నేర్చుకొనుటకు కారణమైనట్లే, దైవ సామీప్యము పొందుటకు కూడ కారణమగును".

(హఖాయిఖుల్ ఫుర్ఖాన్, సంపుటి 1, పుట 308)

కావున రమజాన్ మాసమును నిష్టాపరతను నేర్చుకొనుటకు, ధర్మబద్ధమైన జీవితము గడుపుటకు, దైవ సామీప్యము పొందుటకు ఒక సాధనముగా చేయనిదే రమజాన్ మాసము కేవలము దుఆల ఆమోదమునకు కారణము కాజాలదు. ఈ స్థితి ఏర్పడినప్పుడు అల్లాహ్ తఆలాతో ఏర్పడిన సంబంధము రమజాన్ వరకు మాత్రమే పరిమితము గాకుండ శాశ్వత మార్పు గల ప్రభావములు వ్యక్తము చేయును. నేను సమీపములోనే యున్నానను విషయమే అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో తెలిపెను. షైతాన్ బంధించబడును, అల్లాహ్ తఆలా దగ్గరకు వచ్చునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి.

(సహీ బుఖారి, కితాబు స్సౌమ్, బాబ్ అల్ యకూలూ రమజాన్ అవ్ షహరు రమజాన్.......హదీస్ సంఖ్య 1899, మరియు సహీ బుఖారి కితాబ్ త్తాహజుద్ బాబ్ దు:ఆ వ సలాత్ మిన్ ఆఖిరుల్ లైల్...హదీస్ సంఖ్య 1145)

కాని ఎవరికి దగ్గరగును. అల్లాహ్ తఆలా సామీప్యమును ఊహించుచున్న లేదా ఊహించదలచిన వారికి, ఇందుకు అల్లాహ్ తఆలా మాటలను పాటించిన వారికి దగ్గరగును. అల్లాహ్ తఆలా ఆదేశము فَلْيَسْتَجِيبُوا لِي ను పాటించుటకు ప్రయత్నింతురు. అల్లాహ్ తఆలా ఆదేశములను తెలుసుకొందురు. వాటిని ఆచరించుటకు సిద్ధముగా ఉన్నామని అందురు. అల్లాహ్ తఆలా సర్వశక్తిమంతుడని, నేను అతని ఈ ఆదేశములను పాటించుచు అతనికే ప్రత్యేకమై అడిగినచో అతడు నా విన్నపమును వినునని నమ్ముదురు, విశ్వసింతురు. ఇలాంటి వారికే అల్లాహ్ తాలా దగ్గరగును.

అల్లాహ్ తాలా తన దాసుల ప్రశ్నలకు నేను మీ సమీపంలోనే ఉన్నానని, నేను నా దాసుల దు:ఆలను ఆలకించెదనని, ప్రత్యేకించి ఈ మాసంలో నేను మీకు అతి సామిప్యంనకు చేరుకున్నానని, కావున నన్ను వేడుకొనుమని, అంతేగాకా తమ దు:ఆలను స్వీకరింప జేసుకొనుటకై ముందుగా నా నిబంధనను "నా ఆదేశములను వినుచు, వాటిని ఆచరించుము" పూర్తిచేయుము. నా శక్తి సామర్థ్యములన్నింటిపై పూర్తి నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్గి యుండుము సమాధానం ఇచ్చును.

మేము దుఆ చేయుచున్నాము కాని ఆమోదించబడడం లేదనే వారు ఎంత వరకు అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుచున్నారో ? పరిశీలించుకోవలెను. మనము ఆచరించనిచో, మన విశ్వాసము కేవలము సంప్రదాయము వరకు పరిమితమైనచో మేము అల్లాహ్ తఆలాను పిలిచినాము కాని మా దుఆలు ఆమోదించబడడం లేదనుట పొరపాటగును.

దుఆ ఆమోదముకై అల్లాహ్ తఆలా ఎటువంటి నియమములు పెట్టినాడో తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "అల్లాహ్ తఆలా మొదటి విషయమును ఇట్లు తెలిపెను. నేను ప్రజల మాటను ఆలకించుటకై నిష్టాపరత, దైవ భీతి స్థితిని మీలో కలిగించుకోవలెను. నిష్టాపరత కలిగి, అల్లాహ్ తఆలాతో భయపడినచో, దైవ భీతి యున్నచో అల్లాహ్ తఆలా మాటను వినును".

(అయ్యామే సులహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 14, పుట 261)

నిష్టాపరతను కల్గి యుండుము, అల్లాహ్‌కు భయపడుము, అల్లాహ్ భీతి హృదయంలో ఉన్నప్పుడే అతడు మన దు:ఆలను స్వీకరించును. రెండవ విషయమేమనగా నన్ను విశ్వసించవలెను. ఎటువంటి విశ్వాసము ? అల్లాహ్ తఆలా యున్నాడు. సర్వ శక్తులను, సామర్థ్యములను అతడు కల్గి యున్నాడు. అల్లాహ్ తాలా సర్వశక్తిమంతుడు, సర్వాధికారి అనే అనుభవంను మానవుడు పొందినను, పొందకున్నను లేదా దేవుడు సర్వశక్తి మంతుడు, సర్వాధికారి అనే వివేకంను కల్గి యున్నను, లేకున్నను చివరికి దేవుడు ఉన్నాడు, అతడే సర్వ శక్తిమంతుడు, సర్వాధికారి అనే విశ్వాసంను, నమ్మకంను తప్పక కల్గి యుండాలి. దీనినే రాభోవు కాలముపై ధృడ విశ్వాసమును కల్గియుండుట అందురు. ఒకవేళ మానవునికి ముందునుండే వివేకం ఉన్నచో, అల్లాహ్ తాలా ఉనికిపట్ల, అతను సర్వ శక్తులకు యజమాని, దుఆలకు అతడు సమాధానమిచ్చుననే అనుభవం కూడ కల్గుతుంది. అందుకై ముందు

మానవుడు తన విశ్వాసంను పటిష్టం చేసుకోవలెను. ఆ తరువాత అల్లాహ్ తాలాయే అతనిని ముందుకు నడిపించును. అతనికి ఆధారాలను చేకూర్చును. దుఆల ఆమోద నియమములు, దాని సూత్రముల తత్వజ్ఞానము మొ॥ విషయములను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనేక సందర్భములలో విస్తృతముగా వివరించిరి.

ఇప్పుడు నేను హజ్రత్ మసీహ్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కొన్ని ఉపదేశములను మీ ముందు ప్రస్తావించెదను. తద్వారా మనము ఈ అంశంను గూర్చిన సున్నితమైన విషయాలను నేర్చుకుంటు, వాటి ద్వారా ఈ రమజాన్ మాసంలో దైవానుగ్రహమును పొందుటకు అనుకూలంగా మలుచుకొంటూ, తమ విజ్ఞానం, వివేకంను కూడ వృద్ధి చేసుకోవచ్చును. అంతేగాకుండా స్వచ్ఛమైన మార్గదర్శనమును పొందువారిలో కూడ మనము చేరుతు రమజాన్ మాసపు వాస్తవమైన అనుగ్రహమును పొందవచ్చును. వేడుకొనిన దు:ఆలన్నియు తప్పకుండా స్వీకరించవలెనని కొందరు భావించెదరు. ఈ విషయంలో అల్లాహ్ తాలా దు:ఆలను స్వీకరించుటకు కొన్ని నిబంధనలను ఏర్పాటు చేసినాడు, కావున వాటిని పూర్తి చేయడం కూడ మన భాధ్యతయేనని తెల్పినాను కాని ఇప్పుడు మీముందు దు:ఆలు స్వీకరించబడుటకు గల నిబంధనలు ఏమిటి?, కొన్ని సందర్భాలలో మనము నిబంధనలన్నియు పూర్తి చేసినను మనము ఆశించిన విధముగానే దు:ఆలు ప్రతిఫలంను అందించలేవు అను విషయంలో మిక్కిలి వివరణను ఇచ్చెదను, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి:

"దు:ఆల నిబంధన ఏమిటనగా, అల్లాహ్ తాలా దు:ఆలను స్వీకరించుటలో మన ఉహలకు, కోరికలకు అనుగుణమై యుండదు. పిల్లలు తమ తల్లులకు ఎంతో ప్రాణప్రదమై యుందురు. తల్లులు కూడ తమ పిల్లలకు ఎలాంటి కష్టాలు రాకూడదని కోరుకుంటారు. కాని బాలుడు అవివేకంతో మొండివైకరిని ప్రదర్శిస్తు, ఏడుస్తు పదునైన కత్తిని లేదా మండుచున్న నిప్పు రవ్వను పదే పదే కోరుకున్నచో, తన బిడ్డపై స్వచ్ఛమైన ప్రేమాభిమానంలు, హృదయంలో మమకారం ఉన్నాకూడ ఆ తల్లి తన బాలుడు మండుచున్న నిప్పు రవ్వను తీసుకొని తన చేతిని కాల్చుకొనుటకు లేదా పదునైన కత్తిని తీసుకొని తన చేతిని కోసుకొనుటకు ఏ విధముగానైన ఇష్టపడునా? ఏ మాత్రం ఇష్టపడదు. ఈ మమకారంతోనే మనము దు:ఆల ఆమోదమును అర్థం చేసుకోవచ్చును". మరల ఇట్టనిరి " ఏ దేని దు:ఆలో ఏదేని భాగం మనము నష్టంను కల్గించునట్లు ఉన్నచో ఆ దు:ఆ స్వీకరించబడదనే విషయంలో కూడ నేను స్వీయ అనుభవంను కల్గి యున్నాను. మన తెలివి తేటలు పరిపూర్ణమైనవి కావని కూడ మనము ఈ విషయం ద్వారా తెలియును. శుభప్రదమైనవని మనము అనేక కార్యక్రమాలను సంతోషంతో నిర్వహిస్తుంటాము. అంతే గాకుండా వాటి ప్రతిఫలం కూడ చాలా శుభప్రదముగానే ఉండునని మనము భావిస్తూంటాము. కాని చివరికి అవి మనము చేదు ఫలితాలను, బాధాకర పరిస్థితులను తెచ్చిపెట్టును. మొత్తమునకు మానవుని కొరికలన్ని సత్ఫలితాలిచ్చునని మనము ఆశించలేము. (అనగా మన కోరికలు ప్రయోజన కరమైనవేనని మనము ఖచ్చితముగా చెప్పలేము) ఎందుకనగా పొరపాటు మరియు మరచిపోవును అనే రెండు మిశ్రమాల కలయికయే మానవుడు. (అనగా మానవుడు మరచిపోగలడు, పొరపాట్లు చేయగలడు)అందువలనే కావలెను, కావలసి యుండెను అనే కోరికలే అధిక శాతం నష్టప్రదమై యుండును. ఒకవేళ అల్లాహ్ తాలా అలాంటి దు:ఆలను స్వీకరించినచో అతని కరుణామయ స్వభావంనకు పూర్తి విరుద్ధమగును".

తను కోరుకున్నది తనకు కావలెనని మానవుడు ఆశించును, కాని అలాంటి ఆశలే అనేక సందర్భాలలో కీడును తలపెట్టును. ఒకవేళ అల్లాహ్ తాలా అతని కోరికను తీర్చినచో అది అల్లాహ్ తాలా కరుణా స్వభావంనకు విరుద్ధమైన చర్య అగును. అల్లాహ్ తాలా దు:ఆలు చేయువారి కొరకు, తన భక్తుల కొరకు తన కరుణను ప్రసాదించ దలిచినాడు. అలాంటి పరిస్థితులలో నష్టమును చేకూర్చు కోరకలను తీర్చినచో దేవుని దైవత్వంనకే మచ్చ పడును. మరల ఇట్లనిరి " అల్లాహ్ తాలా తన దాసుల మొరను ఆలకించును, వాటిని నెరవేర్చునను విషయం అక్షర సత్యం. కాని ప్రతి ప్రయోజనకరమైన, అప్రయోజనకరమైన దు:ఆలను మాత్రం కాదు. ఎందుకనగా మానవుడు ఉద్వేకంలో ఫలితంను గూర్చి ఆలోచించకుండా దు:ఆలు చేస్తుంటాడు. కాని అల్లాహ్ తాలా సర్వజ్ఞుడు కావున ప్రయోజనం, అప్రయోజనంలను గూర్చి అవగాహన ఉన్నందున మరియు వేడుకొను వారి దు:ఆలను స్వీకరించినచో వాటి వలన కలుగు దుష్ఫలితాలు, దుష్ప్రభావములు తెలిసి నందున వాటిని రద్దు చేయును. ( మానవుడు తన అంతిమంను గమణించుకోలేడు. కాని అల్లాహ్ తాలా తన భక్తుని స్వచ్ఛమైన శ్రేయోభిలాషి అయినందున అతని శ్రేయస్సును కోరుకొనును. అతనికి అంతమును గూర్చి తెలియును. చివరికి ఏమి జరుగునో, వాటి చెడు పలితాలు ఎలా ఉండునో అతనికి స్పష్ఠముగా కనిపించును. అతనికి ఏవిధముగా నష్టము కలుగును. అతని అంతము ఎలా ఉండునో అల్లాహ్‌కు తెలిసినందున అతని దు:ఆలను రద్దు చేయును. ఎందుకనగా అల్లాహ్ తాలా అతని దు:ఆలను రద్దు చేయుటలోనే అతని శ్రేయస్సును భావించును) మరల ఇట్లనిరి: ఇలా దు:ఆను రద్దు చేయుటయే అతని దు:ఆను స్వీకరించనట్లగును. ( ఇలాంటి దు:ఆల అల్లాహ్ తాలా సమక్షంలో రద్దు గావించబడినప్పుడు, స్వీకరించబడనప్పుడు ఇదియే అల్లాహ్ తాలా స్వీకరించుటకు నిదర్శనమగును. ఎందుకనగా అల్లాహ్ తాలా ఆ మానవుని కొరకు, తన దాసుని కొరకు ఆ దు:ఆ అప్రయోజన కరమైనదని భావించెను) అందుకే అపాయం, ప్రమాదాల నుండి సురక్షితమైన దు:ఆలనే అల్లాహ్ తాలా స్వీకరించును. కాని కీడును తలపెట్టు దు:ఆలను తిరస్కరించిన రూపంలోనే స్వీకరించును". ( ప్రయోజనం చేకూర్చు దు:ఆలను మాత్రమే అతడు స్వీకరించును, నష్టాలు కల్గించు దు:ఆలను రద్దు చేయును. రద్దు చేయుటయే వాటి స్వీకరణ అగును)

మరల ఇట్టనిరి:" ఉజీబూ కుల్లా దుఆయిక అనే దైవవాణి నాపై పదే పదే అవతరించినది, మరో పదాలలో దీని అర్థం ఏమిటనగా ప్రతి దు:ఆ దాని నైజంలో ప్రయోజన కరమైనచో, శ్రేయస్కరమైనచో స్వీకరించబడును"

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 106-107. ఎడిషన్ 1985 లండన్)

వేడుకొను విధానంలో ప్రయోజన కరమైనది, ప్రయోజనం చేకూర్చునది, శ్రేయస్కరమైనదియే స్వీకరించబడును. ప్రతి దు:ఆ స్వీకరించబడదు. అందుకే అల్లాహ్ తాలా తన అవతారుల, పుణ్యపురుషుల దు:ఆలలో కూడ కొన్నింటిని స్వీకరించును, కొన్నంటిని రద్దు చేయును. అవి ప్రయోజన కరమైనవి కావని తెలిసినందున లేదా వాటి పలితాలు భయానకంగా వెలువడు వేళలోనే అతడు వాటిని స్వీకరించడు. ఎందుకనగా అల్లాహ్ తాలా రాభోవు విషయాల పరిజ్ఞానం గలవాడు, సర్వజ్ఞాని.

దు:ఆల కొరకు తమ కర్మలను, తమ విశ్వాసాలను పరిక్షించుకోవాలనే విషయమును వెల్లడించుతు వారిట్లనిరి.

"ప్రయత్నాలు చేయకుండా దుఆ చేయు వ్యక్తి ( కేవలం దు:ఆలు చేయడమే కాకుండా ప్రయత్నములు కూడ చేయవలెను) అల్లాహ్ తఆలాను పరీక్షిస్తున్నాడనుట సత్యము. (ఒకవేళ ప్రయత్నాలు చేయకుండా కేవలం దు:ఆలే చేసినచో అవి దు:ఆలుగా గుర్తించబడవు. పైగా అల్లాహ్ తాలాను పరీక్షిస్తున్నట్లుగా ఉండును) అందుకే దుఆ చేసే ముందు తమ సర్వ శక్తులను వినియోగించుట అనివార్యము. ఈ దుఆ అర్థము ఇదే. మానవుడు మొదట తన విశ్వాసము, కర్మలను పరిశీలించుట అనివార్యము. ఎందుకనగా సాధనాల ద్వారా సంస్కరించటం అల్లాహ్ తఆలా సాంప్రదాయము. (సంస్కరణ కొరకు కొన్ని సాధానాల అవసరముండును) సంస్కరణకు కారణమగు ఏదేని ఒక సాధనమును అతడు ఏర్పాటు చేయును. దుఆ చేసినప్పుడు సాధనముల అవసరమేమిటని అనే వారు ఇచట కాస్త గమనించవలెను. (దు:ఆ చేస్తే సరిపోతుంది, ప్రయత్నించవలసిన అవసరములేదని అందురు) వారు అవివేకులు. దుఆ స్వయముగా ఒక సాధనము, (దు:ఆ కూడ ఒక సాధనము వలే పని చేయును, మనము ఆశించిన పని నెరవేరుటలో ఇది ఒక సాధనము వలే పని చేయును) అది ఇతర సాధనములను ఏర్పాటు చేయునని ఆలోచించవలెను. (దు:ఆ స్వయంగా ఒక సాధనము. అంతేగాకుండా ఒక కారణముగా నిలుచును. దు:ఆ స్వీకరించ బడినప్పుడు ఆ కార్యము నెరవేర్చుటకై ఇతర సాధానాలు స్వయంగా ఏర్పడుతాయి. ఒక వ్యక్తికి అరువు కావలసి యున్నప్పుడు, ధనం కావలసి యున్నప్పుడు, మరొకరి సహాయం అవసరమైనప్పుడు అల్లాహ్ తాలా ఏదో ఒక విధముగా అతనికి ఆ అవసరాలు తీర్చు ఏర్పాట్లు చేయును. అతని కొరకు సౌకర్యమును కల్పించును. సులభంగా ఒక వస్తువు లభించదు. ఒకవేళ ఏవరికైన ధన సహాయం కావలసి వచ్చినప్పుడు ఆకాశం నుండి క్రిందకు వేయడు, ఒకరి మాధ్యమముతో సహకరించును. దు:ఆ వలన అల్లాహ్ తాలా ఈ విధముగా సహకరించును.) మరల ఇలా తెల్పిరి: **ఇయ్యాక నస్తయీాన్** కంటే ముందు **ఇయ్యాక నాబుదు** యుండుట ఈ విషయమును ప్రత్యేకముగా విశదీకరించును. (ముందుగా ఇయ్యాకా నాబుదు అని తెల్పిన తదుపరియే నీ నుండి సహాయంను ఆర్జించెదము. దు:ఆ చేయడంతో పాటు సహాయంను కూడ ఆర్జించెదము. దు:ఆ తో పాటు సహాయం ఒక సాధనంనకు కారణమగును). అనగా సాధనములను ఏర్పాటు చేయుట దైవ పద్ధతిగా మనము చూచున్నాము. దాహమును తీర్చుటకు నీరు, ఆకలిని తీర్చుటకు భోజనమును ఏర్పాటచు చేయును, కాని సాధనముల ద్వారా అని గమనించగలరు. ఈ సాధనముల పరంపర ఇలాగే కొనసాగును. సాధనములను తప్పక ఏర్పాటు చేయును. ఎందుకనగా దేవునికి ఈ రెండు నామములు గలవు. **అజీజన్ హకీమా** ప్రతి పనిని చేయుట అజీజ్ కాగా, (విజయోత్సం గలవాడు, సర్వ శక్తిమంతుడు, అన్ని పనులు చేయువాడు, చేసి చూపు వాడు) ప్రతి పనిని ఏదేని వివేకము, సందర్భము ప్రకారము చేయుట హకీమ్ అనబడును. మొక్కలు, వృక్షములలో రక రకాల ప్రత్యేకతలను గలవు. తర్బుద్‌ను (ఒక రకమైన ఔషధము) చూడుము! విరేచనాలను అది ఒకటి రెండు తులాల వరకు తీసుకొచ్చును. అలాగే సక్మోనియా. (ఒక రకమైన ఔషధము) ఏమి లేకుండానే విరేచనం అగుట, నీరు లేకుండానే దాహం తీర్చు శక్తి అల్లాహ్ తఆలాకు గలదు. కాని ప్రకృతి విశిష్టతల విద్య తెలుపుట కూడ అనివార్యమై యుండెను. ఎందుకనగా దైవ నిర్ణయ విచిత్రములు తెలిసిన కొద్ది మానవుడు అల్లాహ్ తఆలా లక్షణములను తెలుసుకొని సామీప్యము పొందు అర్హత సాధించును.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 124-125. ఎడిషన్ 1985, లండన్)

అల్లాహ్ తాలా సృష్టించిన ప్రతి వస్తువు యొక్క గుణం, ప్రత్యేకత ఈ రెండింటిని పరిచయం చేయవలసిన భాధ్యత దేవునిపైనే యున్నది.తద్వారా వీటి సృష్టి కారకుడు కూడ అల్లాహ్‌యేనని ప్రజలకు తెలియును. మరల ఇట్లనిరి అల్లాహ్ తాలా సృష్టించన వస్తువుల లక్షణాలు, ప్రత్యేకతలను గూర్చిన విజ్ఞానం ఎంత అధికంగా విస్తరించినచో అంతే అధికంగా అల్లాహ్ తాలా యొక్క లక్షణాలు కూడ బహిర్గతమగును. మానవునికి వాటిని గూర్చిన అవగాహన కలుగుతుంది. వాటిని అధ్యాయణం చేయలనే కోరిక మానవునిలో కలుగుతుంది. ఇదియే ఒక ప్రపంచపు వ్యక్తి యొక్క ఆశయం. ఒక నాస్తికుడు తన వివేకంను చాలా గొప్పగా భావించుకొనును. కాని ఒక విశ్వాసి ఆ విజ్ఞానం ద్వారా అల్లాహ్ తాలా యొక్క లక్షణాలను, ప్రత్యేకతలను, శక్తి సామార్థ్యములను తెలుసుకొనుటకు ప్రయత్నించును.

మరల దు:ఆ యొక్క తత్వంను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లు తెల్పిరి:

" చూడుము ఒక బాలుడు ఆకలితో అలమటించును. పాల కోసం తల్లడిల్లుచు రోధించును. ఎక్కిల్లు పడుచు ఏడ్చును. అప్పుడే తల్లి చాతిలోకి పాలు పొంగుతు వచ్చును. వాస్తవానికి ఆ బాలుడు దు:ఆ యొక్క నామమును కూడ ఏరుగడు. కాని ఇది ఏ అనుబంధం బాలుడి రోదన పాలను ఆకట్టుకొనును. సాధారణంగా ఈ విషయంలో ప్రతి ఒక్కరికి అనుభవం ఉండే ఉంటుంది. కొన్ని సందర్భాలలో తల్లులు తమ చాతిలో పాలు ఉన్నట్లు కూడ భ్రమించరు. కొన్ని సందర్భాలలో పాలు ఉండవు. కాని పిల్లవాడి ఆర్తనాధాలు తల్లి చెవులకు వినిపించిన వెంటనే ఆ బాలుడి ఆర్తనాధాలకు ఆ పాలను ఆకట్టుకొను ఒక గురుత్వకరణ శక్తి ఉన్నట్లు పాలు పొంగుతు వచ్చును. ఒకవేళ అల్లాహ్ తాలా ఆస్థానంలో మనము కూడ ఆ విధముగానే తల్లడిల్లినచో అతని అనుగ్రహమును, కరుణను పొంగించుక వచ్చును".

(మల్ఫూజాత్ సంపుటి1. పుట 198. ఎడిషన్ 1985, లండన్)

తల్లి, పిల్లల ఉదాహారణను ఇచట పేర్కొనడం జరిగినది, ఇదియే దు:ఆ యొక్క తత్వం. దీనిని ఆధారం చేసుకొని మాత్రమే మనము వేడుకొనవలెను. మానవుని స్వభావం ఈ విధముగా మార్పు చెందినప్పుడు అల్లాహ్ తాలా కూడ తన అంగీకారపు దృశ్యంను చూపించును.

వేడుకొనుట మానవుని కర్తవ్యం. ఆమోదించుట దేవుని కార్యము. దీనిన నమ్మని, అర్థము చేసుకొనని వాడు అసత్యుడు. నేను ప్రస్తావించిన బాలుని ఉదాహరణ దుఆ తత్వమును మంచిగా పరిష్కరించును. రహ్మానియ్యత్, రహీమియ్యత్ రెండు కాదు. ఒక దానిని విడిచి రెండవ దానిని పొందగోరిన వ్యక్తికి అది లభించదు.( ఒకవేళ రహీమియ్యత్‌ను పొందడం కొరకు రహ్మానియ్యత్‌ను వీడినచో దానిని పొందలేము) రహీమియ్యత్ ద్వారా లబ్ది పొందు సామర్థ్యము మనలో పుట్టించుటను రహ్మానియ్యత్ ఆశించును. ఇలా చేయని వ్యక్తి వరముల పట్ల కృతఘ్నుడు. **ఇయ్యాక నాబుదు** అర్థమమేనగా నీవు ప్రసాధించిన బాహ్య వసతులు, సాధనముల ద్వారా మేము నిన్నే ఆరాధింతుము. ( మేము ఆరాధించెదము. బాహ్య వసతులలో ఒక వసతి దు:ఆ. మరొకటి మన కార్యం రూపు దాల్చుకోవడం కొరకు నిర్దేశించిన వస్తువులన్నింటిని ఉపయోగంలోకి తీసుక రావడం) లాలాజలాతో, అవయవములతో కూడిన ఈ నాలుకను చూడుము. (మనకు నాలుక గలదు. అది ఒక అవయవముగా ఉపయోగ పడుతుంది. దాని లోపలి భాగంలో లాలాజలం ఉండును) ఇలా లేనిచో మనము మాట్లాడలేము. (ఒకవేళ నాలుక ఎండినచో మనము మాట్లాడలేము. నాలుకలోని ఏదేని ఒక నాళం నిలిచినచో నాలుక నిలకడగానే యుండును) హృదయ భావాలను సైతం ప్రస్తావించ గల నాలుక దుఆ కొరకు బహుకరించెను. అంతటి ఘనత గల నాలుకతో ఒకవేళ మనము పని తీసుకోననిచో ఇది మన దురదృష్టమగును. అనేక వ్యాధులు గలవు. అవి నాలుకకు సోకినచో ఒక్కసారి నాలుక తన పని చేయుట వీడును. అప్పుడతడు మూగ వాడగును. మనకు నాలుకను ప్రసాధించడం ఇది అతని ఎంతటి దయాగుణం. అదే విధముగా మన చెవుల ఆకారములో తేడా వచ్చినచో ఏమియును వినిపించదు. ఇదే పరిస్థితి హృదయముది. అందులో బాధాతప్త స్థితి, ఆలోచించు శక్తులు గలవు. వ్యాధి సోకినచో దాదాపు అన్ని వృధా అగును. పిచ్చి వారి శక్తులు ఎలా నిరుపయోగమగునో చూడగలరు. ఈ దైవ వరములకు కృతజ్ఞత తెలుపుట మన కర్తవ్యము కాదా? అల్లాహ్ తఆలా తన గొప్ప అనుగ్రహముతో మనకందించిన ఈ శక్తులను వీడినచో మనము కృతఘ్నులగుదుము. కావున గుర్తుంచుకోవలసినది ఏమనగా ఒకవేళ మనము మన శక్తి, యుక్తులను వీడి దుఆ చేసినచో ఆ దుఆ ఎలాంటి ప్రయోజనము కలిగించదు. ఎందుకనగా మనము మొదటి అనుగ్రహముతో పని తీసుకోనప్పుడు రెండవ దానిని ఎలా, ఎప్పుడు మనము లాభదాయకముగా చేసుకోగలము.

(మల్ఫూజాత్ సంపుటి1, పుట 130-131. ఎడిషన్ 1985, లండన్)

అల్లాహ్ తాలా సృష్టించిన అవయములు కూడ ఒక అనుగ్రమమే. వాటిని ఉపయోగించుకొనుచు, ఆ తరువాత దు:ఆ చేసినప్పుడే మనకు ప్రయోజనం చేకూరును.

సృష్టి ధర్మములో దు:ఆలు ఆలకించిన ఆనవాళ్ళు, ఉదాహారణలు ఉన్న విషయంను తెలుపుచు మరల ఇట్లనిరి:

" మొత్తమునకు సృష్టిలో దు:ఆల స్వీకరణకు చెందిన ఆనవాళ్ళు గలవు. ప్రతి యుగంలో అల్లాహ్ తాలా ఎన్నో సజీవ నిదర్శనాలను నిలిపెను. అందు కొరకే అతను ఇహ్‌ది నస్స్‌రాతల్ ముస్తఖీమ సిరాతల్లజీనా అన్ అంత అలైహిం దు:ఆను బోధించెను. ఇదియే అల్లాహ్ తాలా కోరిక మరియు శాసనం. దానిని మార్చెవారు ఎవరు లేరు. ఇహ్‌ది నస్స్‌రాతల్ ముస్తఖీమ అనే దు:ఆ ద్వారా మన ఆచరణలను పరిపూర్ణము, పరిసమాప్తం చేసుకోవలెనని తెలియుచున్నది. (అనగా మనము పరిపూర్ణముగా ఆచరిస్తు, వాటిని వాటి ఉన్నత స్థాయి వరకు చేర్చవలెను) ఆ పదాలను పరిశీలించినచో మనకు తెలియునది ఏమనగా కేవలం బాహ్యంగానే సంజ్ఞ పరంగా దు:ఆ చేయవలెనని సూచించడమైనది. (బాహ్యంగా అనగా సంకేతములతో దు:ఆ చేయుము) సిరాతే ముస్తఖీమ్ యొక్క మార్గ దర్శనం పొందడం కొరకు దు:ఆ చేయుమని బోధించడమైనది. కాని దానికి ముందు ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్ అని పేర్కొని దాని నుండి లాభము పొందమని సూచించడమైనది.అనగా సిరాతే ముస్తఖీమ్ యొక్క స్థాయిలను దాటుటకు అల్లాహ్ తాలా అనుగ్రహించిన శక్తి సామార్థ్యములను ఉపయోగించుతు, అతని సహాయంను వేడుకొనవలెను. కావున బాహ్య సాధనాల ఆవశ్యకత తప్పనిసరిగా యుండును. వీటిని వీడినవారు అల్లాహ్ యొక్క అనుగ్రహములను తిరస్కరించిన వారగుదురు"

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 199. ఎడిషన్ 1985, లండన్)

మరల వారిట్లనిరి. అనేక వ్యాదులు ఎలా ఉండుననగా ఒకవేళ అవి పొరపాటున కూడ నాలుకకు సోకినచో నాలుక పని చేయుట ఒక్కసారిగా ఆగిపోవును. (నాలుకను గూర్చి ఇంతకు ముందే తెలుపడమైనది) ఇది కరుణతో కూడినది. ఆదే విధముగా హృదయంలో కూడ వినయ విధేయతలు, ఆలోచనలు, అన్వేషణలకు చెందిన అనేక శక్తులు కల్గియుండును. కావున గుర్తుంచుకోవలసిన విషయం ఏమనగా మనము ఈ శక్తులను వినియోగించు కోకుండా వాటిని వీడి కేవలం దు:ఆలపై ఆధారపడి యున్నచో మనకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. ఎందుకనగా ముందుగా అనుగ్రహించిన శక్తులనుండి ప్రయోజనం పొందలేనప్పుడు, తదుపరి శక్తుల నుండి ఏవిధముగా ప్రయోజనం పొందగలరు. అందువలనే ఇహదినస్సిరాతల్ ముస్తఖీమా కు ముందు ఇయ్యాక నాబుదు ను చేర్చి నీవు మాకు ముందుగా ప్రసాధించిన శక్తులను వృధా చేయలేదు. వాటిని నిరుపయోగ్యముగా మార్చలేదని అంగీకరింప జేయడమైనది. గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమిటనగా దయామయుని యొక్క ప్రత్యేకత ఏమిటనగా అది కరుణమయుని నుండి ప్రయోజనంను పొందుటకు అర్హులను చేయును. ఇందు మూలంగానే అల్లాహ్ తాలా ఉద్‌ఉని అస్తజిబ్‌లకుం లో కేవలం పదాల ఉచ్చరణయే గాకుండా మానవుని స్వభావంలోనే అల్లాహ్‌ను వేడుకొను లక్షణం గలదని తెలుపడమైనది. వేడుకోవడం మానవుని నైజం కావలెను. కాని ఏవరైతే అల్లాహ్ తాలాను వేడుకోరో ( అనగా ఏవరైతే అల్లాహ్ తాలాతో దు:ఆలను స్వీకరింప జేసుకొనుటకు ప్రయత్నించరో) వారు దౌర్జన్యులుగా పేర్కొనబడుదురు. దు:ఆ ఎంతటి మాధుర్యాన్ని చేకుర్చుననగా దానిని నేను ప్రపంచీకులకు ఏ పదాలలో వివరించవలెనో తెలియక విచారిస్తున్నాను. అనుభవించిన వారికే దాని మాధుర్యము తెలియును. సంక్షిప్తముగా తెలుపునది ఏమనగా దుఆ నియమములో అనివార్యమైన మొదటి విషయము సత్కర్మలు, నమ్మకము ఏర్పర్చుకోవడం. ( సత్కార్యములు చేయవలెను. అనగా అల్లాహ్ తాలా ఆదేశించిన కార్యములనే అమలు చేయవలెను. మరియు తమ విశ్వాసమును, తమ నమ్మకమును పటిష్ట పర్చుకోవలెను) ఎందుకనగా తన విశ్వాసములను చక్కదిద్దుకోకుండా, సత్కర్మలు చేయకుండా కేవలం దుఆలు చేసినచో అతడు అల్లాహ్ తఆలాను పరీక్షిస్తున్నట్లు అర్థం. వాస్తవానికి ఇహిదినస్సిరాతల్ ముస్తఖీమ్ దు:ఆలో గల ముఖ్యోద్దేశం ఏమనగా మన కర్మలను పరిపూర్ణ స్థాయికి చేర్చవలెను. వాటిని సమగ్రం కూడ చేయవలెను. మరల సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహింలో మేము సరైన మార్గదర్శనంను దేనినైతే నీ అనుగ్రహం పొందినవారు అనుసరించిరో దానిని పొందగోరుచున్నామని మరియు ఆ తదుపరి మమ్ము నీ ఆగ్రహంకు గురైన వారి మార్గము నుండి రక్షించమని అంగీకరింప జేయడమైనది. మరల ఇట్లనిరి, ఎవరు తమ దుష్కార్యముల వలన దేవుని ఆగ్రహంనకు గురి అయినారో వారి నుండి కూడ మమ్ము రక్షించుము. మరియు జ్వాల్లిన్ లో నీ ఆధరణ ఉన్నను తమ మూర్ఖత్వం వలన మార్గం తప్పిన వారి నుండి కూడ మమ్ము రక్షించుము అని ఈ దు:ఆలో నేర్పించడమైనది. (మల్ఫూజాత్ సంపుటి1, పుట 199-200. ఎడిషన్ 1985, లండన్) అంతేగాకుండా మమ్ము నీ అనుగ్రహం పొందని వారిలో చేర్చకుము, నీ దయామయం నుండి ప్రయోజనం పొందని వారిలో మమ్ము చేర్చకుము. అలా అయినచో మేము నీ కరుణతో ఎలాంటి ప్రయోజనంను పొందలేము. కావున మమ్ము నీ అనుగ్రహం నుండి, నీ సహాయం నుండి, నీ కరుణ నుండి దూరం చేయకుము, మార్గం తప్పకుండా

చూడుము. ఈ విధముగా జ్వాల్లీన్ లో మనకు ఈ విషయాల వైపు కూడ శ్రద్ధ చూపించడమైనది.

అల్లాహ్ తాలా ఆస్థానంలో రోదించినచో, ఆవేధనను వ్యక్త పర్చినచో ఏం ప్రయోజనం ఉండదని ఆలోచించే ప్రపంచీకుల ఆలోచనలను ఖండిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెల్పిరి:

" అల్లాహ్ తాలా ఆస్థానంలో రోదించినచో, ఆవేధనను వ్యక్త పర్చినచో ఏం ప్రయోజనం చేకురదని కొందరు ప్రపంచీకులు ఆలోచించెదరు. ఇట్టి ఆలోచన సరైనది కాదు. ఇది అసత్యం. ఇలా ఆలోచించే వారికి దేవుని ఉనికిపై, అతని సుగుణాలపై, అతని శక్తి సామార్థ్యలపై, అతని అధికారలపై ఏమాత్రం విశ్వాసం లేదని అర్ధం. ఒకవేళ వారిలో స్వఛ్ఛమైన విశ్వాసమే ఉన్నచో వారు ఇలా మాట్లాడుటకు సహసించరు. ఎప్పుడైనను, ఏ వ్యక్తి అయినను అల్లాహ్ ఆస్థానంలోకి వచ్చి తాను మనస్ఫూర్తిగా ప్రాయశ్చిత్తం చేసుకొనుచు అతని వైపు మ్రోకరిల్లినచో అట్టి వారిని అల్లాహ్ తాలా ఎల్లప్పుడు అనుగ్రహిస్తునే వచ్చాడు. ఒకరు ఎంతో బాగా తెల్పిరి:

అనగా ప్రియుడు కనికరించని ఆ ప్రేమికుని స్థితి ఎలా ఉండును. ఓ వ్యక్తి ! నీలో ఆవేదనయే లేదు, వైద్యుడు ప్రక్కనే ఉన్నాడు. మనిషిలో ఎలాంటి బాద లేన్నప్పుడు వైద్యుడు మాత్రం ఏమి చేయగలడు. కావున తమలో ఆవేధనను కల్గించుకొన్నచో అల్లాహ్ తాలా తప్పకుండా మొరను ఆలకించును.

మరల ఇట్లు తెలిపిరి: మీరు స్వఛ్ఛమైన హృదయంతో అతని సన్నిదిలోకి రావలెనని అల్లాహ్ తాలా కోరుకొంటున్నాడు. కాని నిబంధన ఏమిటనగా అందుకు అనుగుణంగా నీవు తనను తాను తీర్చి దిద్దుకోగలవు. (ఫల్ యస్తజీబూలీపై ఆచరించుము) అల్లాహ్ తాలా సన్నిదికి చేర్చు ఆ పావనమైన మార్పును నీవు నీలో కల్గజేసుకో, నేను పదే పదే సత్యమునే తెలుపుచున్నాను. అది ఏమనగా మన దైవంలో అనేక అద్భుతమైన శక్తి సామార్థ్యములు గలవు. మరియు అతనిలో ఎనాడు తరగిపోని అనుగ్రహములు, శుభములు గలవు. కావున వాటిని తిలకించి, వాటిని పొందుటకు నీలో అభిమానపు నేత్రమును జనింపజేసుకొనుము. ఒకవేళ స్వఛ్ఛమైన అభిమానమే యున్నచో అల్లాహ్ తాలా చాలా అధికంగా మీ దు:ఆలను ఆలకించును, స్వీకరించును. అదే విధముగా మీకు సహకరించును కూడ". (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 352-353. ఎడిషన్ 1985. లండన్)

దేవుని స్వఛ్ఛమైన ప్రేమను పొందుటకు మానవుడు ఏమి చేయవలెను, ఏ కారణం చేత అల్లాహ్ తాలా మన ప్రార్ధనలను ఆలకించును, మరి ఏ విధముగా అతడు తన సామీప్యమును బహిర్గతము చేయును అను విషయంను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లు తెల్పిరి:

" ఇందుకు గల నిబంధన ఏమిటనగా, అల్లాహ్ తాలా పట్ల స్వఛ్ఛమైన ప్రేమాభిమానములు కల్గి యుండవలెను. అల్లాహ్ తాలా యొక్క ప్రేమకు మానవుని పాపపు జీవితమును కాల్చి బూడిద చేసి ఒక నూతనమైన, పావనమైన జీవితమును అందించు శక్తి గలదు. అప్పుడు అతడు గతంలో వీక్షించని అద్భుతములను కూడ వీక్షించగలడు, గతంలో ఆలకించని విషయాలను కూడ ఆలకించును. మొత్తమునకు మానవుని కొరకు అల్లాహ్ తాలా సిద్దము చేసిన అనుగ్రహం, కరుణలతో కూడిన ఆహారమును సేకరించు, దాని నుండి ప్రయోజనంను పొందుటకు కావలసిన అనేక శక్తులను ప్రసాధించినాడు.( అతడు కేవలం వస్తువులనే కాకుండా, శక్తి సామర్ధ్యములను కూడ ఇచ్చినాడు. తద్వారా మనము వాటిని వినియోగించుకుంటు లాభమును పొందవచ్చును) ఒకవేళ అతడు కేవలం శక్తులను ప్రసాధించి వస్తువులను తయారు చేయనిచో అందులో ఒక లోపము కనిపించును. లేదా వస్తువులను తయారు చేసి వాటిని వినియోగించుకునే శక్తిని ఇవ్వనచో ఏం లాభం చేకూరును. కాని అలా జరుగలేదు. అతడు శక్తులను ప్రసాధిస్తు, వస్తువులను కూడ సిద్దపర్చినాడు. ఏ విధముగానైతే అతడు ఒకవైపు రొట్టెను ఇస్తునే మరోవైపు కన్నులు, నాలుక, పండ్లు, జీర్ణశయం కల్పించెను. అంతేగాకుండా కాలేయం, ఉపరితిత్తులు మొ॥ వాటితో పని ప్రారంభించెను.ఆహారమును వీటి అన్నింటికి ఆధారముగా చేసెను." మరల ఇట్లు తెల్పిరి, " ఒకవేళ కడుపులోకి ఏమి వేళ్ళనిచో హృదయానికి రక్తం ఎక్కడి నుండి వచ్చును. ఈ విధముగానే అతడు అన్నిటికన్న ముందు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు పరిపూర్ణమైన ధర్మమును ఇచ్చి పంపెను. వారిని ప్రవక్తలందరికి నాయకుడిని చేసెను. పవిత్ర ఖుర్ఆన్ వంటి సంపూర్ణమైన, ప్రాధాన్యత గల అద్భుత గ్రంధమును బహుకరించెను. వీరి తదనంతరం ప్రపంచంలో ప్రళయకాలం వరకు మరో దైవ గ్రంధము అవతరించదు. మరి ఏ నూతన ప్రవక్త కూడ నూతన శాసనముతో అవతరించలేడు. అందుకే అల్లాహ్ తాలా మనకు అనుగ్రహించిన ఆలోచించే, అవగాహన చేసుకునే శక్తులతో పని చేసుకోకుండా, అల్లాహ్ తాలా వైపు అడుగులు వేయకుండ ఉన్నచో దీనిని ఎంతటి నిర్లక్ష వైఖరి, ఎంతటి కృతఘ్నుడు అందురో ఒక్కసారి ఆలోచించుము. అల్లాహ్ తాలా మొదటి అధ్యాయములోనే మన కొరకు ఎంత విశాలవంతమైన అనుగ్రహపు మార్గమును చూపినడో ఒక్క గమనించండి.

(కావున ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వంటి అద్భుత అవతారున్ని అందించినప్పుడు వారి సాంప్రధాయమును అవలంభించుటయే మానవుడు లాభము పొందు మార్గమగును. పవిత్ర ఖుర్ఆన్ గ్రంధము వంటి పరిపూర్ణమైన గ్రంధమును బహుకరించినప్పుడు ఆ గ్రంధపు ఆదేశానుసారం నడుచుకోవలెను. ఈ విధముగా అల్లాహ్ తాలా మొదటి అధ్యాయమైన సూరయే ఫాతిహా లోనే మనకు ఇంతటి విశాలమైన మార్గమును సుమగం చేసెను) మూలగ్రంధముగా, పరిపూర్ణమైన గ్రంధముగా పేర్కొనబడే ఈ ఆధ్యాయములో మానవుని యొక్క జీవిత లక్ష్యయాలను, దానిని సాదించుటకు కావలసిన విధానాలను గూర్చి విశదీకరించడమైనది. ఇయ్యాక నాబుదు వాస్తవానికి మానవుని అంతరాత్మ యొక్క ఆకాంక్షయే, దీనిని ఇయ్యాక నస్తయీన్‌కు ముందు ప్రస్తావించుతు సాధ్యమైనంత వరకు మానవుడు తన ఆధినంలో ఉన్న శక్తిని, దైర్యంను, అవగాహనలతో అల్లాహ్ తాలా ప్రీతిని పొందుచు అతని మార్గమును ఎంచుకొనుటలో ప్రయత్నములు చేస్తు, కష్టపడుచు మరియు అల్లాహ్ తాలా అనుగ్రహించిన శక్తులను పూర్తి స్థాయిలో వినియోగించవలెను. ఆ తదుపరి మాత్రమే ఆ కార్యంలో సఫలం, ప్రతిఫలం పొందుటకై అల్లాహ్ తాలా సన్నిదిలో దు:ఆ చేయవలెను".

(మల్ఫూజాత్ సంపుటి1, పుట 353-354. ఎడిషన్ 1985, లండన్)

అల్లాహ్ తఆలా విజ్ఞానమును పొందుటకు గల మార్గములేమిటో తెలుపుచు వారిట్లనిరి.

"మానవుడు బలహీన సృష్టి خُلِقَ الۡاِنۡسَانُ ضَعِیۡفًا అనుట సత్యము. అతడు అల్లాహ్ తఆలా అనుగ్రహము, దయ లేనిదే అతడేమియును చేయలేడు. (అనుగ్రహము లేనిచో మానవుడు ఏమియును చేయలేడు) అతని ఉనికి, సంరక్షణ, జీవించు వసతులన్నియు అల్లాహ్ తఆలా అనుగ్రహముపై ఆధార పడియున్నవి. తన తెలివి, తేటలు, ధనము, ఆస్తిపై గర్వపడే వ్యక్తి అవివేకి. ఎందుకనగా ఇదంతయు అల్లాహ్ తఆలా అనుగ్రహమే. అతడెక్కడి నుండి తెచ్చినాడు ? తన బలహీనత, లోపమును పూర్తిగా గుర్తించుట, భావించుట దుఆ కొరకు తప్పని సరి. తన బలహీనతపై ఆలోచించిన కొద్ది అల్లాహ్ తఆలా సహాయ సహకారములు అవసరమని గుర్తించును. ఈ రకంగా దుఆ కొరకు అతనిలో ఒక ఉద్రేకము ఏర్పడును". (దు:ఆ కొరకు ఉద్రేకము కల్గడం లేదని ప్రజలు అంటూ ఉంటారు. మానవుడు తన బలహీనతలను గమనించుకోవలెను, తన వినయ విదేయతలను పరిశీలించుకోవలెను, అభిమానపు నిబంధనలను పూర్తి చేయవలెను, అప్పుడే ఒక ఉద్రేకము జనించును) మరల ఇట్లు తెలుపెను. మానవుడు ఆపదలో పడినప్పుడు, దుఃఖము లేదా బాధ కలిగినప్పుడు చాలా గట్టిగా పిలుచును, అరువును, ఇతరునితో సహాయము కోరును. ఇలాగే అతడు తన బలహీనతలు, లోపములను గమనించినచో తనకు తాను అనుక్షణం అల్లాహ్ తఆలా సహాయము అవసరమని భావించును. అప్పుడు అతని ఆత్మ పూర్తి ఉద్రేకము, బాధతో అల్లాహ్ తఆలా ఆస్థానములో పడి అరువును, ఓ సంరక్షకుడా ! ఓ సంరక్షకుడా ! అని పిలుచును. పూర్తి శ్రద్ధతో పవిత్ర ఖుర్ఆన్‌ను పరిశీలించినచో మీకు తెలియునది ఏమనగా, మొదటి అధ్యాయములోనే అల్లాహ్ తాలా ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ సిరాతల్లజీన అన్అమ్‌త అలైహిం ఘైరిల్ మఘ్జూబి అలైహిం వలా జ్వాల్లీన్ దు:ఆను బోధించడం జరిగినది". మరల ఇట్లు తెల్పిరి, "లాభములను , ప్రయోజనాలను చేకూర్చు స్వభావమును తనలో కల్గి యున్నప్పుడు, మరియు అన్ని రకాల లోపాలతో, నష్టాలతో కాపాడు స్వభావం ఉన్నప్పుడు మాత్రమే ఆ దు:ఆ పరిపూర్ణమవుతుంది. కావున ఈ దు:ఆలో లాభాలను, ప్రయోజనాలను చేకూర్చు అన్ని విషయాలు గలవు. అంతేగాకా మానవునికి పెద్ద ఎత్తున నష్టమును కల్గించు సాధనాల నుండి, మానవున్ని నాశనం చేయు మార్గాల నుండి కూడ రక్షించు తత్వం ఈ దు:ఆలో గలదు". (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 411-412. ఎడిషన్ 1985, లండన్)

కావున గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం ఏమిటనగా ఇచట ప్రపంచము గూర్చి కాకుండ ధర్మమును గూర్చియే అధికంగా దు:ఆ నేర్పించడమైనది. అందువలనే మనము తన ధర్మమును రక్షించుకొనుటకు అధికంగా దుఆ చేయవలెను. మానవుడు ఇలా దు:ఆ చేసినచో అల్లాహ్ తఆలా సామీప్య ద్వారములు వాటంతట అవే తెరుచుకొనును.చేసిన దు:ఆలన్నియు ఆమోదం పొందును.

ధర్మపటిష్ఠతకు చేయు దు:ఆయే అసలైన దు:ఆ అని, ఇట్టి దు:ఆల ద్వారానే అల్లాహ్ తాలా సామిప్యం, మరియు ఇతర దు:ఆలు స్వీకరించబడుతాయని వివరించుతు మరల వారిట్లనిరి:

"ఉజీబూ దావతద్దాయి ఇజా దాఆని అనగా నేను ప్రాయశ్చిత పడువాని పాపములను క్షమించెదను. అల్లాహ్ తాలా యొక్క ఈ వాగ్దానం స్వఛ్ఛమైన హృదయంతో ప్రాయశ్చిత్తం చేయువాని ప్రయత్నమును సరైనదే నని నిర్ధారించుచున్నది. ఒకవేళ అల్లాహ్ తాలా నుండి ఇలాంటి వాగ్దానం లేనిచో ప్రాయశ్చిత్తునికి విముక్తి లభించడం కష్టమై యుండేది. స్వఛ్ఛమైన హృదయంతో తమ పాపములను అంగీకరించు వానికి ప్రతిఫలంగా అల్లాహ్ తాలా ఒక పాశ్చత్తాపునితో చేసిన వాగ్దానములన్నియు అతనికై కూడ పూర్తిచేయును. అప్పుడే ఒక తేజోవంతమైన కాంతి అతని హృదయంలో వెలుగొందును. ఆ

తదుపరియే మానవుడు నేను పాపములన్నింటి నుండి దూరంగా నుందునని, ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యత నిచ్చెదనని వాగ్దానం చేయును"

(మల్ఫూజాత్ సంపుటి 5, పుట 300. ఎడిషన్ 1985, లండన్)

అల్లాహ్ తఆలా తన సామీప్యము, దుఆ ఆమోదము కొరకు తెలిపిన విషయములలో అన్నిటి కంటే గొప్పది నమాజ్ స్థితి అని తెలిపెను. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"దు:ఆయే నమాజ్ యొక్క ముఖ్యోద్దేశము, సారంశము. దుఆ చేయడం కూడ అల్లాహ్ యొక్క ధర్మమునకు అనుకూలమైనది. మనము సాధారణముగా చూచినచో బాలుడు అరిచి, ఏడ్చినప్పుడు, కలత చెందినప్పుడు తల్లి ఎంతో వ్యాకులతతో తన బాలునికి పాలు పట్టించును. దైవము, దాసునిలో కూడ ఇటు వంటిదే బందమే గలదు. దీనిని ప్రతి వ్యక్తి అర్థము చేసుకోలేడు. మానవుడు అల్లాహ్ తఆలా ఆస్థానములో పడినప్పుడు అతి వినయము, వినమ్రతతో అతని ముందు తన స్థితులను విన్నవించుకున్నప్పుడు అతనితో తన అవసరాలను యాచించినప్పుడు దైవ కరుణ ఉద్రేకించును. అప్పుడు అటువంటి వ్యక్తి కరుణించబడును. అల్లాహ్ తఆలా అనుగ్రహము, శుభముల పాలు కూడ ఒక రోధనను ఆశించును. (అల్లాహ్ తఆలా అనుగ్రహము, శుభ పాలు త్రాగదలచినచో, అతని దయానుగ్రహములతో లబ్ది పొందగోరినచో అందుకు వినయ, విధేయతలను పాటిస్తు, రోధించవలెను) అందుకే అతని ముందు కన్నీరు కార్చే కనులను చూపవలెను".

(మల్ఫూజాత్ సంపుట 1, పుట 352. ఎడిషన్ 1985, లండన్)

అల్లాహ్ తఆలా కృపానుసారము రమజాన్ మాసంలో అధికులకు నమాజ్‌లకై శ్రద్ధచూపుతున్నారు. సామూహిక నమాజ్ చదువుటకు ప్రయత్నిస్తున్నారు. అంతేగాకా నవాఫిల్ సలుపే ప్రయత్నాలు కూడ చేస్తు, ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనిస్తు, దైవ సామీప్యము పొందుటకు గల దుఆలను ప్రత్యేకమైన శ్రద్దతో పఠించవలెయును. ఇట్టి దు:ఆలకే ప్రధమ స్థానంను కేటాయించాలి. మన అవసరాలను తీర్చు దు:ఆలను, ప్రపంచ సాధనకు చెందిన దు:ఆలకు తదుపరి స్థానమును కేటాయించవలెను. అలా అయినచో అల్లాహ్ తఆలా స్వయముగా మన అవసరాలను పూర్తి చేయును.

ఇప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక దుఆను ప్రవేశపెట్టుచున్నాను. అల్లాహ్ తఆలా సామీప్యము పొందుటకు దీనిని ఈ రోజులలో మనము ప్రత్యేకంగా చేయవలెను. అల్లాహ్ తఆలా ఆస్థానములో వారీ దుఆ చేసిరి.

"ఓ ప్రపంచ సంరక్షకుడా ! నేను నీ ఉపకారములకు కృతజ్ఞతలు తెలుపలేను. నీవు అతి దయామయుడవు, దానకర్తవు. నీ అనన్య ఉపకారములు నాపై గలవు. నేను నాశనము కాకుండా యుండుటకు నా పాపములను క్షమించుము. నాకు జీవితము లభించుటకు నీ ప్రత్యేక ప్రేమను నా హృదయములో స్థిరపర్చుము. నన్ను క్షమించుము. నీ ప్రసన్నత భాగ్యము లభించు కర్మలు నాతో చేయించుము. నీవు దానకర్తవు అయినందుననే నీ కోపము నాపై పడకూడదని నేను నీ ఆశ్రయమును వేడుకొంటున్నాను. ప్రతి శుభము, అనుగ్రహము నీ ఆధీనంలోనే యున్నందున నన్ను కరుణించుము, ఇహ, పరలోక ఆపదల నుండి నన్ను రక్షించుము. ఆమీన్ సుమ్మ ఆమీన్".

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 235. ఎడిషన్ 1985, లండన్)

మనము దుఆ వాస్తవమును అర్థము చేసుకొనువారమగుగాక! అల్లాహ్ తఆలాపై గట్టి నమ్మకము గల వారిలో ఈ రమజాన్ మనలను చేర్చుగాక! అనంతరం శాశ్వతముగా దీనిపై నిలుచుదుము గాక! అనగ వారు అతని ఆదేశములను విని, ఆచరింతురు. తమ ప్రతి మాటపై అల్లాహ్ తఆలా ప్రీతికి ప్రాధాన్యతనిత్తురు. మన కర్మలు పూర్తిగా అల్లాహ్ తఆలా ఇష్టము ప్రకారముండుగాక! మన విశ్వాసములో గతము కంటే మించి దృఢత్వము ఏర్పడుగాక! మాలో అల్లాహ్ తఆలా నిజమైన ప్రేమ ఏర్పడుగాక! అల్లాహ్ తఆలా మమ్ములను ఇహ, పరలోక ఆపదల నుండి కూడ రక్షించుగాక! (ఆమీన్)

నమాజ్ తరువాత నేను ఇరువురి పరోక్ష జనాజ నమాజ్‌లు చదువించెను, అందులో ఒకరు గౌ॥ రాజా గాలిబ్ అహ్మద్ గారిది. వీరు చాలా కాలం నుండి జమాఅత్‌కు సేవలందించుచుండిరి, ఉర్దులో పేరు గాంచిన కవులు, సాహితివేత్తలు, విద్యావంతులు. వీరు ప్రభుత్వ ఉద్యోగులు, పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్ర పాఠ్య పుస్తకాల ప్రచురణ విభాగ అధ్యక్షులుగా కూడ భాధ్యతలు నిర్వహించిరి. వీరు జూన్ 4, 2016న 88 సంవత్సరాల వయస్సులో లాహోరులో పరమ పదించిరి. " ఇన్నా లిల్లాహి వ ఇన్న ఇలైహి రాజీవూన్". వీరు గుజ్రాత్ రాష్ట్రములో 1928లో జన్మించిరి. వీరి తండ్రి గారు హజ్రత్ రాజా అలి ముహమ్మద్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహస్సలాం గారి అనుచరులు. వారు 1905లో బైఅత్ చేసి అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. రాజా అలి ముహమ్మద్ గారికి ఖాదియాన్‌లో నాజిర్ బైతుల్ మాల్, నాజిర్ ఆలా గా భాధ్యతలు చేపట్టు భాగ్యము లభించినది. రాజా గాలిబ్ గారి తాతా గారు ( తల్లి తండ్రి) మలిక్ బర్కత్ అలి గారు. అంతేగాకా అహ్మదియ్య సింహంగా బిరుదు పొందిన హజ్రత్ మలిక్ అబ్దుర్రహ్మాన్ గారు రాజా గాలిబ్ గారికి మామ గారు. రాజా గాలిబ్ గారు లాహోర్‌లో 10 వతరగతి ఉతీర్ణులైరి. ఖాదియాన్‌లో 12 వ తరగతి పూర్తి చేసిరి. ఆ తరువాత లాహోరు ప్రభుత్వ కళాశాల నుండి సైకాలజీలో డిగ్రి మరియు మాష్టర్ డిగ్రి పూర్తి చేసిరి. మాష్టర్ డిగ్రిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిరి. వీరు కవులుగా, సాహితి వేత్తలుగా, విద్యావేత్తలుగా సాహిత్య, సాంస్కృతిక ప్రపంచములో గౌరవనీయులుగా తమకంటు ఒక ప్రాధాన్యతను ఏర్పర్చుకొనిరి. వీరి కవితలు, పద్యాలు, వ్యాసాలు ఉర్దు, ఆంగ్ల మాధ్యమాలలో జమాఅత్ పత్రికైన అల్ ఫజల్‌లోనే కాకుండా జాతియ్య, అంతర్జాతియ్య పత్రికలలో కూడ ప్రచురించబడేవి. వారు తమ ఉద్యోగ జీవనంను పాకిస్తాన్‌లోని సైనిక శిభిరం నుండి ప్రారంభించిరి. ఆ తదుపరి 1962లో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ అధికారిగా, ఆ తదుపరి అత్యున్నతమైన అధికారిగా భాధ్యతలు నిర్వహించిరి. జనరల్ సెక్రటరిగా, కంట్రోలర్ బోర్డు ఆఫ్ ఇంటర్ మీడియట్ సెంకండరి ఎజ్‌క్వేషన్ పంజాబ్‌గా, చైర్మన్ బోర్డు ఆఫ్ ఇంటర్ మీడియట్ సర్‌గోదాగా, చైర్మన్ ఆఫ్ పంజాబ్ టెక్స్ బుక్ బోర్డుగా, విద్యా నిపుణులుగా, జాతీయ, రాష్ట్రీయ విభాగాలలో అమూల్యమైన సేవలు అందించిరి.

జమాఅత్ పరంగా కూడ వీరు చాలా విభాగాలలో సేవలు అందించిరి. జమాఅత్ అహ్మదియ్యా జిలా లాహోర్‌కు వీరు జనరల్ సెక్రటెరిగా, సెక్రటెరి తాలిమ్‌గా, ఇలా అనేక పదువుల ద్వారా వారు సేవలందించిరి. 1974 తదుపరి, వారు జమాఅత్ అమ్మదియ్య ప్రతినిధులుగా అనేక మార్లు ప్రెస్ కాన్ఫరెన్స్‌ను, ప్రెస్ రిలీజ్‌ను నిర్వహించి వారి అభిప్రాయాలను తెలియపరిచిరి. లేఖలు వ్రాసేవారు, పత్రికలకు స్వీయ అభిప్రాయాలను పంపేవారు. 1974 నుండి 85 వరకు డైరక్టర్ వక్ఫేజదీద్‌గా మరియు నాసర్ ఫండేషన్‌కు ఉపాధ్యక్షులుగా, 1992 నుండి 97 వరకు డైరెక్టర్ ఫజలే ఉమర్ ఫండేషన్‌గా భాధ్యతలను నిర్వహించిరి. సాధారణ తత్వం గలవారు. నెమ్మదస్తులు. ఖిలాఫత్ పట్ల చాలా అనుబంధము ఉండేది, జమాఅత్ పదువులను చాలా గౌరవించేవారు. అల్లాహ్ తాలా వారికి తన అనుగ్రహమును ప్రసాధించును గాకా! వారికి సంతానం లేనందున వారు ఒకరిని దత్తత తీసుకొనిరి. వార ఆ కుమార్తెకు అల్లాహ్ తాలా సహనంను, దైర్యంను ప్రసాధించు గాకా!

రెండవ జనాజ గౌ॥ మలిక్ ముహమ్మద్ అహ్మద్ గారిది, వీరు జమాఅత్ సేవలకై తమ జీవితంను అంకితం చేసినవారు. వీరు మే 6, 2016న పరమపదించిరి. "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్". వీరివురి జనాజ నమాజ్‌లను గత జుమా రోజునే చదువించేవాడిని, కాని ఏదో కారణం వలన చదువించలేక పోయాను. వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరులైన హజ్రత్ షేక్ ఫజల్ అహ్మద్ బటాల్వి (ర) గారి ప్రథమ పుత్రుడు. అహ్మదియ్య ఖలీఫాలతో, ఖిలాఫత్ వ్యవస్థ పట్ల వినయ, విధేయత, అభిమానంను కల్గి యుండేవారు. వారి సంతానమును కూడ ఈ లక్షణములనే అలవర్చుకొమ్మని ప్రోత్సహించేవారు. జమాఅత్ వ్యవస్థ పట్ల విధేయత చూపువారు, చాలా ఉత్తములు, అందరితో అప్యాయతో మసలుకొను వారు, నెమ్మదస్తులు, బందువులతో సత్ప్రవర్తనతో మసలుకొనువారు. సత్కార్యములు చేయువారు, సానుభూతి పరులు, వారి జీవితంలో చాలా కుటుంభాలను పోషించేవారు, చాలా మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేవారు, వారి మరణం వరకు చాల సంతోషంతో ఈ విధానాన్ని కొనసాగించిరి. తహరీకే జదీద్‌కు చెందిన ప్రథమ వర్గమునకు చెందిన 5000 వేల సేనలో వీరు కూడ ఒకరు.

మస్జిద్ నిర్మాణ కార్యక్రమాలలో, ఇతర ప్రోత్సాహక కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా చందాలు చెల్లించేవారు. రభ్వాలో గల వారి ఒక ఎకరం భూమిని, ఒక ప్లాట్‌ను కూడ జమాఅత్‌కు అంకితం చేసినారు. అక్టోబర్ 20 1945లో వీరు తమ జీవితంను అంకితం చేసిరి. జీవిత అంకితంనకు పూర్వం వీరు బయటి దేశాలలో కూడ పని చేసిరి. 1949 నుండి 55 వరకు రభ్వాలోని నిర్మాణత్మక శాఖలో సేవలు అందించిరి. 1955నుండి 68 వరకు వకాలతే తబ్షీర్‌లో సుప్రింటెండెంట్‌గా, 1969 నుండి 82 వరకు ఉప అధికారిగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల శాఖలో సేవలందించిరి. 1982 నుండి 86 వరకు వకీలుల్ మాల్ శాఖకు రెండవ ఉప అధికారిగా కూడ సేవలందించిరి. 1985లో పదవి విరమణ పొందిరి. మరల 1986 నుండి జూన్ 1989 వరకు రి ఎంప్లాయిమెంట్‌గా వకీలే తాముల్ వ తన్‌ఫీజ్‌లో ఉప అధికారిగా సేవలు అందించిరి. ఇలా వారు సుమారు 47 సంవత్సరముల నిరంతరంగా సేవలు అందించిరి. ఆ తదుపరి వారు తమ పిల్లల వద్దకు అనగా జర్మనికి నివాసం మార్చిరి.

చాలా ఆరాధనలు చేయువారు. ప్రతి రోజు పవిత్ర ఖుర్ఆన్ పారయణం చేసేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పుస్తకములను అనేక సార్లు చదివిరి. అల్లాహ్ తాలా దయ వలన వీరు కూడ వసియ్యత్ వ్యవస్థలో సభ్యత్వం పొంది యుండిరి. వారికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. మన ముభల్లిఘ్ గారైన లైయీక్ తాహిర్ గారు వీరి చిన్న సోదరులు. మరియు అల్‌ఫజల్ ఇంటర్నేషనల్‌లో పని చేయుచున్న మన మలిక్ మహమూద్ గారు వీరి చిన్న కుమారుడు. అల్లాహ్ తాలా వీరికి తన అనుగ్రహంను ప్రసాదించును గాకా, వారి సంతానానికి, వారి కుటుంభ సభ్యులందరు వినయ, విధేయతలతో, జమాఅత్‌తో, ఖిలాఫత్‌తో అనుసంధానం కొనసాగించు భాగ్యమును ప్రసాదించును గాకా! (ఆమీన్)

❄❄❄

EDITOR
SYED RASOOL NIYAZ
SUB EDITOR: MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 21 July 2016 Issue No. 20

MANAGER
NAWAB AHMAD
Mobile. : (+91) 94170-20616
Tel : (+91)-1872-224757
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

# ఇమామ్ మహ్ది అన్వేషణలో ఇస్లాం ప్రపంచము

అల్లాహ్ తఆలా సయ్యదినా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా పదవిపై నియమించి, సంపూర్ణ, శాశ్వత ధర్మశాసనమైన పవిత్ర ఖుర్ఆన్ నొసంగి ప్రపంచము మొత్తమునకు కరుణామయునిగా చేసి పంపెను. ఫలితముగా ప్రకాశవంతమైన ఇస్లాం శిక్షణాకాంతులు ప్రపంచ అధిక భాగమును తన ఒడిలో చేర్చుకొనెను. హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత వారి ఉత్తరాధికారులు, ధర్మసంస్కర్తల ద్వారా సుమారు వెయ్యి సంవత్సరముల వరకు ఈ శాంతిభద్రతలనిచ్చు శిక్షణ ప్రజ్వలించెను, రాను రాను ముస్లింలు పవిత్ర ఖుర్ఆన్ భోధనలను, ప్రవక్త పద్దతులను విస్మరించి దుష్కార్యములలో మునిగిన ఫలితముగా, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి "ఇస్లాం నామ మాత్రముగా మిగులును, పవిత్ర ఖుర్ఆన్ పదాల రూపంలో నుండును, వైభవోపేతమైన మస్జిద్‌లు నిండియుండును కాని దార్మికత లోపించును. వారి మత గురువులు, భూమిపై అధములుగా పరిగణింపబడుచుందురు, ఉపద్రవము, ద్రోహము వారి నుండే పుట్టి వారి వైపే తిరిగిపోవును" (మిష్కాత్ కితాబుల్ ఇల్మ్) పూర్తయ్యెను.

ముసల్మానుల భయాందోళనలను పారద్రోలుటకు మరియు వారి మనోధైర్యం కొరకు ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెను వెంటనే ఒక శుభవార్త కూడా అందించియుండిరి. అనగా ఇట్టి ఉపద్రవ కాలము నందు విశ్వాసము కృత్తికా నక్షత్రమునకు చేరియుండినను, అప్పుడు పారసీకులలో నుండి ఒక వ్యక్తి లేదా కొందరు ఆ విశ్వాసమును అచటి నుండి తెచ్చి లోకుల హృదయాలలో స్థాపింతురు.

ముస్లిం సోదరులారా! విశ్వాసమును కృత్తికా నక్షత్రము నుండి తెచ్చు వ్యక్తినే హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం మసీహ్ మౌవూద్, మహ్ది మాహుద్ అని పిలిచిరి. కనుక ఇబ్నెమాజలో ఇట్లు హదీసుగలదు "లల్ మహ్దియ్యు ఇల్లా ఈసా" అనగా మహ్దీ, మసీహ్ రెండు ఒకరి బిరుదులే. ఈ అంతిమ కాలపు వాగ్దాత్తను న్యాయ నిర్ణాయకులుగా, న్యాయమును స్థాపించువారిగా, శిలువను రూపుమాపు వారిగా నుడివిరి. అతని కాలము నందు ఖడ్గయుద్ధములు నిషేధించబడునని వార్తనిచ్చుచూ ఇట్లు తెలిపిరి. "యజహుల్ హర్‌బ్' (బుఖారీ షరీఫ్ చూడుము) అనగా ఆ యుగము కేవలము హృదయాలను పరిశుభ్రపరచి, శాంతిభద్రత నిచ్చు పవిత్ర ఖుర్ఆన్ బోధనలను ప్రచారము చేయు కాలమై యుండును, సత్యవంతులైన ఇమామ్ మహ్ది ఆగమనము తరువాత, రమజాన్ మాసము నందు చంద్రునికి గ్రహణ తేదీలలో మొదటి రాత్రి, సూర్యునికి గ్రహణ తేదీలలోని మధ్య రోజు గ్రహణమేర్పడునని కూడా శుభవార్త నిచ్చియుండిరి. (దారెఖుత్నీ)

రెండు వేల సంవత్సరముల ముందు హజ్రత్ ఏసుక్రీస్తు ఇస్రాయిల్ సంతతి వైపు ప్రవక్తగా పంపబడియుండిరను విషయం తెలిసినదే. పవిత్ర ఖుర్ఆన్, సత్యహదీసుల ద్వారా వారు మరణించిరని బుజువైనది. శుభవార్త నియ్యబడిన మసీహ్ మౌవూద్ వాస్తవమునకు ఇస్లాం సాంప్రదాయములోని వాడై హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దాస్యత్వములో పంపబడును. అతనిని గూర్చిన ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమిది. అనగా "ఓ ముస్లిం జనులారా! మీరతనిని ఎప్పుడు చూచిననూ శీఘ్రగతిలో అతని శిష్యత్వములో చేరుము. అతనిని చేరుటకు మంచు దిబ్బలు మోకాళ్ళతో దాటవలసి వచ్చిననూ వెనుకాడకుము, ఎందుకనగా అతడు అల్లాహ్ వాగ్దాత్త అయిన మహ్ది".

కావున పదమూడవ శతాబ్దాంతములో అనేక మంది ధర్మ పండితులు అల్లాహ్‌తో జ్ఞానము పొంది ఇమామ్ మహ్ది వచ్చు కాలమును తెలిపియుండిరి.

అందులకే హజ్రత్ షాహ్ వలియుల్లాహ్ గారు ముహద్దిస్ దహల్వీ రహమతుల్లాహి అలైహి ఇట్లు నుడివిరి. "ప్రళయ దినము ఆసన్నమైనది. ఇమామ్ మహ్ది వచ్చుటకు సంసిద్ధముగా నున్నారు" అను విషయమును వైభవోపేతమైన నా అల్లాహ్ నాకు తెలిపెను (తఫ్‌హీమతే ఇలాహియ్య)

ప్రియ సోదరులారా! అల్లాహ్ తాలా తమ వాగ్దానాలు, తమ ప్రియుడైన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వివరించిన భవిష్యత్వాణులనన్నింటిని అనుసరించి పదునాల్గవ శతాబ్దారంభములో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాంను మసీహ్ మౌవూద్, మహ్ది మాహూద్ పదవి నొసంగి పంపించెను. వారిట్లు ప్రకటించిరి.

"నేను అతని వైపు నుండి మసీహ్ మౌవూద్ మహ్ది మాహూద్‌నని, బహిర్గత, అంతర్గత స్పర్థల నిర్ణాయకుడినని నాకు అల్లాహ్ పవిత్ర పరిశుద్ధ సువార్త తెలిపెను".

(అర్బయీన్ మొదటి భాగము, పుట 3, రుహానీ ఖజాయిన్ సంపుటి 17, పుట 345)

వీరు క్రీ.శ. 1835 సంవత్సరము 1250 హిజ్రీలో జన్మించిరి. క్రీ.శ. 1889లో అల్లాహ్ ఆజ్ఞానుసారము బైఅత్ గైకొనుట ప్రారంభించిరి. దాని కొరకు పది నిబంధనలను సూచించిరి. వాటిలో అల్లాహ్ తప్ప మరొకరిని ఆరాధించరాదని, అల్లాహ్, ప్రవక్త ఆదేశాలను అనుసరించవలెనని, పవిత్ర ఖుర్ఆన్‌ను పూర్తిగా స్వీకరించవలెనని, ప్రతి రోజు ఐదు పర్యాయములు నమాజ్ సలుపవలెనని హజ్రత్ ముహమ్మద్ (సల్లం) మేలును జ్ఞప్తియందుంచుకొని దురూద్ పంపవలెనని, మానవ సేవలో నిమగ్నమై యుండవలెనని ఇస్లాం నియమములను వివరించిరి.

వీరు క్రీ.శ. 1891లో ఇమామ్ మహ్దీ, మసీహ్ మౌవూద్‌నని ప్రకటించిరి. వీరి సత్యనిరూపణ కొరకు అల్లాహ్ తాలా అనేక సంకేతములను చూపెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వివరించిన సూర్యచంద్ర గ్రహణముల సంకేతములు తూర్పు దేశాలలో క్రీ.శ. 1894లోని రమజాన్ మాసములో పశ్చిమ ప్రపంచములో క్రీ.శ. 1895 లోని రమజాన్ మాసము నందు బహిర్గతమైనవి. దీనిని లక్షలాది మంది చూచిరి. అనేక పత్రికలు ప్రచురించి చర్చించినవి.

అజ్ఞాన ముస్లింలను తప్పుద్రోవ పట్టించుటకు వారిలో అనుమానాలు పుట్టించుటకు నవూజు బిల్లాహ్ అహ్మదీయులు, హజ్రత్ ముహమ్మద్ రసూల్లల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమున్నబియ్యీన్ అని విశ్వసించరని, వీరి కలిమా, ఖిబ్లా, ఖుర్ఆన్ మొదలగునవి వేరని, నిందారోపణలు చేయుచూ, బూటకములు పలుకు వారి విషయమును కూడా స్పష్టపరచుట చాలా అవసరము.

జమాఅతే అహ్మదియ్య స్థాపకులు హజ్రత్ మిర్జాగులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం ఇమామ్ మహ్దీ, మసీహ్ మౌవూద్‌గా సంప్రదాయ సందేశహరుల స్థానము, అల్లాహ్ నుండి పొందిన సువార్త, సంభాషణలను గూర్చి ఇట్లు నుడివిరి.

"ఈ గౌరవ స్థానము కేవలము హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించుట వలననే నాకు లభించినది. నేను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజములో లేని వాడనై, వారిని అనుసరించనిచో, నా కర్మలు ప్రపంచములో నున్న పర్వతములకు సమానమున్నను ఈ గౌరవస్థానము, అల్లాహ్‌తో మాట్లాడు భాగ్యము లభించేది కాదు, ఎందుకనగా ఇప్పుడు ముహమ్మద్ ప్రవక్తృత్వము తప్ప ప్రవక్తృత్వములన్నియు అంతమైనవి, ధర్మ శాసనము కలిగిన ప్రవక్త ఎవరూ రాలేరు కానీ ధర్మ శాసనమునకు లోబడి నడుచుకోగల ప్రవక్త రాగలడు, అట్టి స్థితిలో వచ్చిన వారు ఇస్లాం సమాజములో నున్నవారగుదురు, గనుక నేను ఆ సమాజములోని వాడను, సందేశహరున్ని కూడ".


(తజల్లియాతె ఇలాహియ్యహ్ – రూహాని ఖజాయిన్ సంపుటి 20, పుట 411)

ఈ విధముగనే వీరు అల్లాహ్ ఆజ్ఞానుసారము (సూక్తి 56, అధ్యాయము అన్నూరు) ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము ప్రకారము ప్రవక్తృత్వ సాంప్రదాయపు ఉత్తరాధికారత్వమునకు పునాది వేసిరి. అది వాస్తవమునకు సత్యమైన ఇస్లామియా ఖిలాఫత్ మరియు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖిలాఫత్ నీడ దానిని గురించి వారు "ఈ ఖిలాఫత్ ప్రళయము వరకు కొనసాగునని" (ఇన్షాఅల్లాహ్) నుడివి యుండిరి.

నేటి ఇస్లామి విశ్వవ్యాపిత సోదర భావము, భాతృత్వము, జమాఅతే అహ్మదియ్యకు ఖిలాఫతే అహ్మదియ్య ద్వారా లభించిన గొప్ప భాగ్యము, ఫలితముగా తూర్పు, పశ్చిమమున నున్న అహ్మదియ్యులందరు ఒక శరీరమునకు సంబంధించిన ప్రాణము వలె ఒక పిలుపుపై నిలుచుదురు, కూర్చుందురు, వాస్తవమునకు ఇదియే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెచ్చిన నిజమైన ఇస్లాం. కనుక రండి! ముందుకు సాగండి! అల్లాహ్ యొక్క ఈ పిలుపును మీరు అందుకోండి! దీనిని సాధించుటకై ప్రార్థనల ద్వారా సహాయము పొందుచూ, "మాకు సన్మార్గం చూపుము" అను దుఆను తరచుగా చదువుట చాలా అవసరము, ఎందుకనగా 14 వ శతాబ్దము గడిచిపోయి 15వ హిజ్రి శతాబ్దము 35 వ సంవత్సరము సాగుచున్నది. అందువలననే జమాఅతె అహ్మదియ్య స్థాపకులు చాలా బాధపడుచూ ఇట్లు నుడివిరి.

మరొకరు గాక మసీహ్ ఆసన్నమయ్యే సమయమిదే ! నేను రానిచో
మరెవరైనా వచ్చేవారు!!
ఓ జాతి ప్రజలారా! రండి సూర్యుడుదయించెను. ఎంత కాలమని ఆ
అంధకార కూపంలో రాత్రింబవళ్ళు కూర్చుందురు.

❄❄❄

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None

మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of the Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz